



# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక

ప్రశ్నించడం మన హక్కు








సంపుటి : 9 సంచిక : 354 పేజీలు :8 | సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) | ప్రచురణ : కాకినాడ | సోమవారం 24 ఆగస్టు 2026 | వెల : 1/-రూ ॥

VOLUME :9 ISSUE :354 PAGES :8 | EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) | PUBLISHED : KAKINADA | MON 24 AUGUST 2026 | PRICE : 1/- RS

Simultaneously Published form Kakinada,Ongole,Visakhapatnam,Bapatla,Narasarao Peta, YSR Kadapa,Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari,West Godavari,Eluru,Guntur,SPSR Nellore,Tirupati,Chittor,Kurnool,Anantapur


## బంగాళాఖాతంలో అల్పపీడనం.. ఉత్తరాంధ్రకు వర్ష సూచన, మత్స్యకారులకు హెచ్చరిక

- వాయువ్య బంగాళాఖాతంలో అల్పపీడనం
- ఉత్తరాంధ్రలో నేడు, రేపు మోస్తరు వర్షాలు కురిసే అవకాశం
- తీరం వెంబడి గంటకు 40-50 కిలోమీటర్ల వేగంతో గాలులు
- మత్స్యకారులు సముద్రంలోకి వెళ్లవద్దని విపత్తుల సంస్థ హెచ్చరిక



**పెన్ పవర్ డెస్క్:**వాయువ్య బంగాళాఖాతం, దాని పరిసర ప్రాంతాలలో అల్పపీడనం ఏర్పడినట్లు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ వెల్లడించింది. దీని ప్రభావంతో ఉత్తరాంధ్రలో

- మిగతా 2లో

## కాకినాడలో నర్సింగ్ విద్యార్థినుల ఘటనపై సీఎం చంద్రబాబు ఆరా



**పెన్ పవర్ డెస్క్:** కాకినాడలోని ఎస్‌కే కాలేజ్ ఆఫ్ నర్సింగ్ విద్యార్థినుల ఘటనపై ముఖ్యమంత్రి చంద్రబాబు ఆరా తీశారు. సమస్యను తక్షణమే పరిష్కరించాలని ఉన్నతాధికారులను ఆదేశించారు. సీఎం ఆదేశాలతో జిల్లా కలెక్టర్, ఎస్పీ రంగంలోకి దిగి విద్యార్థుల భద్రతకు చర్యలు చేపట్టారు. విద్యార్థినుల వసతి గృహాన్ని కలెక్టర్ హరేంధిర ప్రసాద్ పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడి వారి సమస్యలను

- మిగతా 2లో



## బంగ్లాదేశ్‌లో ఘోరం.. హిందూ టీచర్ ఫ్యామిలీ దారుణ హత్య

**పెన్ పవర్ డెస్క్:**బంగ్లాదేశ్ లో దారుణం చోటుచేసుకుంది. విశ్రాం త హిందూ టీచర్ కుటుంబం హత్యకు గురైంది. తన ఇంటిపై డ్రగ్స్ తీసుకుంటుండడాన్ని ప్రశ్నించి నందుకు దుండగులు ఈ దారుణానికి ఒడిగట్టారు. ఈ సంఘటన రంగ్‌పుర్‌లో చోటుచేసుకుంది. పోలీస్ కమిషనర్ మహ్మద్ అబ్దుల్ వివరాలు వెల్లడించారు. గణపతి చక్రవర్తి (65) కొన్నేళ్ల క్రితం ప్రభుత్వ టీచర్‌గా రిటైర్డ్ అయి హోమియోపతి ప్రాక్టీస్ చేస్తున్నారు.

- మిగతా 2లో



## కారుమూరి అరెస్ట్..

### ప్రభుత్వ కక్షసాధింపు అంటూ విడదల రజని ఆగ్రహం

- మద్యం రవాణా కేసులో మాజీ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు అక్రమ అరెస్టు
- ఇది పూర్తిగా రాజకీయ కక్ష సాధింపు చర్యేనని మండిపడ్డ విడదల రజని
- బీసీ నేతలను లక్ష్యంగా చేసుకుని వేధిస్తున్నారని ప్రభుత్వ తీరుపై ఆరోపణ
- టీడీపీ హయాంలోని మద్యం స్కామ్ నుంచి దృష్టి మరల్చేందుకే ఈ కుట్ర అని విమర్శ
- కారుమూరిని వెంటనే విడుదల చేయాలని డిమాండ్
- లేదంటే ప్రజలే బుద్ధి చెబుతారని హెచ్చరిక

**పెన్ పవర్ డెస్క్:**వైసీపీ సీనియర్ నేత, మాజీ మంత్రి కారుమూరి నాగేశ్వరరావును అక్రమంగా అరెస్టు చేశారంటూ ఆ పార్టీ నేత, మాజీ మంత్రి విడదల రజని తీవ్రస్థాయిలో మండిపడ్డారు. ఇది పూర్తిగా రాజకీయ కక్ష సాధింపు చర్యేనని, దొడ్డిదారిన అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వ అరాచకాలకు ఇది పరాకాష్ఠ అని ఆమె ఆరోపించారు. లేని కేసును సృష్టించి వైసీపీ నేతలను ఉద్దేశపూర్వకంగా వేధిస్తున్నారని విమర్శిస్తూ తాడేపల్లిలో ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు.గత ప్రభుత్వ హయాంలో మద్యం రవాణాలో అక్రమాలు జరిగాయనే నెపంతో మాజీ మంత్రి కారుమూరి నాగేశ్వరరావును హైదరాబాద్‌లో

- మిగతా 2లో

# ప్రభుత్వ పాఠశాలలపై కూటమిది అబద్ధాల ప్రచారం

- కూటమి ప్రభుత్వంపై మాజీ సీఎం జగన్ తీవ్ర విమర్శలు
- యూడైస్ గణాంకాలతో ప్రభుత్వ వాదనలు అబద్ధమని ఆరోపణ
- ప్రభుత్వ పాఠశాలల్లో 5.56 లక్షల మంది విద్యార్థులు తగ్గారని వెల్లడి
- ప్రైవేటుకు మేలు చేసేందుకే ప్రభుత్వ విద్యను బలహీనపరుస్తున్నారని విమర్శ
- తమ హయాంలో నాడు-నేడు, ట్యాబ్‌లతో విద్యారంగాన్ని మార్చామని వెల్లడి




ఆంధ్రప్రదేశ్‌లో పాఠశాల విద్యా రంగంపై వైసీపీ అధినేత జగన్ తీవ్ర ఆరోపణలు చేశారు. రాష్ట్రం లో ప్రభుత్వ పాఠశాలల నుంచి విద్యార్థులు భారీగా తగ్గిపోతున్నారని, కూటమి ప్రభుత్వం మాత్రం అబద్ధపు ప్రచారాలు చేసుకుంటోందని విమర్శించారు. ఈ మేరకు కేంద్ర విద్యాశాఖకు చెందిన యూడైస్ ప్లస్ గణాంకాలను ఉటంకిస్తూ సోషల్ మీడియా వేదికగా ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు.కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రైవేటు పాఠశాలల నుంచి 1.10 లక్షల మంది విద్యార్థులు ప్రభుత్వ బడుల్లో చేరారని ప్రచారం చేసుకోవడంపై జగన్ మండిపడ్డారు. ఇది వాస్తవమైతే ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెరగాలి కదా? అని ప్రశ్నించారు. కానీ, యూడైస్ గణాంకాల ప్రకారం 2023-24 విద్యా సంవత్సరంతో పోలిస్తే, 2025-26 నాటికి ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య 40,50,116 నుంచి 34,93,450కి పడిపోయిందని, అంటే ఏకంగా 5,56,666 మంది విద్యార్థులు తగ్గిపోయారని జగన్ పేర్కొన్నారు. ఇదే సమయంలో ప్రైవేటు పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య 45,53,380 నుంచి 48,40,296కు పెరిగిందని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల సంఖ్య కూడా 45 వేల నుంచి 44,222కు తగ్గిందని ఆవేదన వ్యక్తం చేశారు.

టీడీపీకి నారాయణ, శ్రీచైతన్య వంటి కార్పొరేట్ విద్యా సంస్థలతో ఉన్న సంబంధాల కారణంగానే, ప్రభుత్వ విద్యా వ్యవస్థను ఉద్దేశపూర్వకంగా బలహీనపరుస్తున్నారని జగన్ తీవ్ర ఆరోపణలు చేశారు. తద్వారా ప్రైవేటు సంస్థలకు లబ్ధి చేకూర్చేందుకు చంద్రబాబు ప్రభుత్వం బాటలు వేస్తోందని అనుమానం వ్యక్తం చేశారు.

తమ హయాంలో విద్యా రంగంలో విప్లవాత్మక సంస్కరణలు తీసుకొచ్చామని జగన్ గుర్తుచేశారు. 'మనబడి నాడు-నేడు' కింద రూ.8,524 కోట్లతో పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు

- మిగతా 2లో



## జపాన్‌లో భూకంపం..

### నిలిచిన పోయిన రైళ్లు.. ఆగిపోయిన విద్యుత్ సరఫరా

**పెన్ పవర్ డెస్క్:**జపాన్ లో మరోసారి భూకంపం సంభవించింది. 2026 ఆగస్టు 23న తెల్లవారుజామున 5.9 తీవ్రతతో నమోదైన భూకంపంతో జపాన్ ఒక్కసారి గా ఊగిపోయింది. భవనాలు, వాహనాలు ఊగిపో వడంతో జనాలు ఉన్నట్లుండి కింద పడిపోయారు. వాహనాలు పట్టుతప్పి పడిపోయాయి. పెద్ద పెద్ద భవంతులు పెచ్చులు రాలటం, డ్యామేజ్ అవ్వటంతో భయాందోళనకర పరిస్థితులు ఏర్పడ్డాయి. దాదాపు 23 మంది గాయాలపాల య్యారు ఆదివారం తెల్లవారుజామన 2 గంటల ప్రాంతంలో ఇబరాకి పర్ఫెక్చర్ దక్షిణ

- మిగతా 2లో

## ఏపీ లిక్కర్ రవాణా స్కాం: మాజీ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు అరెస్ట్

- ఏపీ మద్యం రవాణా కుంభకోణంలో మాజీ మంత్రి కారుమూరి అరెస్టు
- హైదరాబాద్ కొండాపూర్‌లో అదుపులోకి తీసుకున్న ఈడీ అధికారులు
- ఇప్పటికే కారుమూరి కుమారుడితో సహా ముగ్గురిని అరెస్ట్ చేసిన దర్యాప్తు సంస్థ
- రూ.195 కోట్లకు పైగా ఖజానాకు నష్టం జరిగిందని ప్రధాన ఆరోపణ
- ముందస్తు బెయిల్ పిటిషన్‌ను సుప్రీంకోర్టు కొట్టివేయడంతో తప్పని అరెస్ట్


**పెన్ పవర్ డెస్క్:**ఆంధ్రప్రదేశ్ మద్యం రవాణా కుంభకోణం కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసులో వైసీపీ సీనియర్ నేత, మాజీ మంత్రి కారుమూరి నాగేశ్వరరావును ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) అధికారులు ఆదివారం అరెస్ట్ చేశారు. హైదరాబాద్‌లోని కొండాపూర్‌లో ఆయనను అదుపులోకి తీసుకున్నారు. ఈ కేసులో ఇప్పటికే ముగ్గురు నిందితులు అరెస్ట్ కాగా, తాజాగా కారుమూరి అరెస్ట్‌తో దర్యాప్తు కీలక దశకు చేరుకుంది.ఇటీవల కారుమూరి నాగేశ్వరరావు దాఖలు చేసుకున్న ముందస్తు బెయిల్ పిటిషన్‌ను సుప్రీంకోర్టు కొట్టివేసిన విషయం తెలిసిందే. జూలై 29న ఈ పిటిషన్‌పై విచారణ జరిపిన సర్వోన్నత న్యాయస్థానం, ఈ స్కామ్ విలువ రూ.350 కోట్లకు పైగా ఉందని వ్యాఖ్యానిస్తూ, కస్టోడియల్ విచారణ అవసరమని స్పష్టం చేసింది. ఈ నేపథ్యంలోనే ఈడీ అధికారులు కారుమూరిని అరెస్ట్ చేసినట్లు తెలుస్తోంది.

**ఏమిటీ మద్యం స్కామ్?**

గత ప్రభుత్వ హయాంలో

- మిగతా 2లో





## బాహుబలి జేసీబీతో గచ్చిబౌలిలో ప్రమాదకర భవనం కూల్చివేసిన హైడ్రా

- గచ్చిబౌలి ఆంజనేయ నగర్‌లో ప్రమాదకర భవనం కూల్చివేత
- మొన్న కూలిన భవనం పక్కనే దెబ్బతిన్న మరో నిర్మాణం
- సీఎంసీ, హైడ్రా ఆధ్వర్యంలో సంయుక్త ఆపరేషన్
- ముందుజాగ్రత్తగా సమీప అపార్ట్‌మెంట్ వాసుల తరలింపు
- అనుమతుల్లేని అక్రమ నిర్మాణాలపై దృష్టి సారించిన అధికారులు

**పెన్ పవర్ డెస్క్:**రంగారెడ్డి జిల్లా గచ్చిబౌలిలోని ఆంజనేయ నగర్‌లో శనివారం ఓ ఏడంతస్తుల భవనం కుప్పకూలిన ఘటన నేపథ్యంలో, దాని పక్కనే ప్రమాదకరంగా మారిన మరో బహుళ అంతస్తుల భవనాన్ని

- మిగతా 2లో




## వందేమాతరం అంటే హిందూ దేవతల పూజ కాదు

- వందేమాతరం అంటే దేవతల ఆరాధన కాదని, భారతమాత ఆరాధన అని రాందేవ్ స్పష్టీకరణ
- గీతాన్ని ఒక మతానికి వ్యతిరేకమనడం మేధో దివాళాకోరుతనమని వ్యాఖ్య
- నిరసన ప్రదర్శనల్లోకి మైనర్లను తీసుకురావడం సరికాదని హితవు
- యూసీసీ అమలు చేసిన ఉత్తరాఖండ్ సీఎం ధామీని ప్రశంసించిన రాందేవ్
- కంగనా వ్యాఖ్యలపై తనదైన శైలిలో స్పందించిన యోగా గురు

- మిగతా 2లో

# అంతరిక్షంలో భారత్ 'నిఘా నేత్రాలు'.. శత్రు క్షిపణులకు సెకన్లలోనే చెక్!

- అంతరిక్షం నుంచి శత్రు క్షిపణి ప్రయోగాలను గుర్తించే సామర్థ్యంపై భారత్ దృష్టి
- ఆపరేషన్ సిందూర్ అనుభవంతో భూస్థిత రాడార్ల పరిమితులను అధిగమించే ప్రయత్నం
- 'ఎస్‌బీఎస్-3' ప్రాజెక్టుతో పాటు ప్రైవేట్ సంస్థల భాగస్వామ్యంతో పటిష్ఠ వ్యవస్థ నిర్మాణం
- బూస్ట్ దశలోనే క్షిపణిని గుర్తించి, దాడిని నిరోధించడానికి ఎక్కువ సమయం పొందడమే లక్ష్యం

**పెన్ పవర్ డెస్క్:**భారత రక్షణ రంగం సరికొత్త సాంకేతిక యుగంలోకి అడుగుపెడుతోంది. శత్రు దేశాల నుంచి ప్రయోగించే క్షిపణులను సెకన్ల వ్యవధిలోనే గుర్తించి, వాటిని గగనతలంలోనే ధ్వంసం చేసేందుకు వీలుగా అంతరిక్ష ఆధారిత ముందస్తు హెచ్చరిక వ్యవస్థను (స్పేస్-బేస్డ్ ఇన్‌ఫ్రారెడ్ ఎర్లీ-వార్నింగ్) భారత్ వేగంగా అభివృద్ధి చేస్తోంది. ఆగస్టు 23న జాతీయ అంతరిక్ష దినోత్సవం సందర్భంగా ఈ కీలక పరిణామం వెలుగులోకి వచ్చింది. 'అంతరిక్షంలో కళ్లు' (ఐస్ ఇన్ స్పేస్)గా పిలుస్తున్న ఈ వ్యవస్థ ద్వారా క్షిపణి ప్రయోగ సమయంలో దాని ఇంజిన్ల నుంచి వెలువడే అత్యధిక వేడిని (ఇన్‌ఫ్రారెడ్ సిగ్నేచర్) ఉపగ్రహాలు తక్షణమే పసిగడతాయి. దీంతో క్షిపణిని దాని ప్రయాణ మార్గంలోనే అడ్డగించి, నాశనం చేయడానికి భారత రక్షణ దళాలకు అమూల్యమైన సమయం

- మిగతా 2లో






# లోకేష్ జగన్ పవన్... ఈ ముగ్గురి మధ్యనే !

ఏపీలో సార్వత్రిక ఎన్నికలకు ధీటుగా మరో భీకర సమరానికి తెర లేచింది. మరో రెండు నెలల వ్యవధిలో ఏపీలో స్థానిక సంస్థల ఎన్నికలు జరుగుతాయి. మొత్తానికి మొత్తం జనాలు ఈ ఎన్నికల్లోనూ ఓట్లు వేస్తారు. పల్లెలు పట్టణాలు మండలాలు నగరాలు అన్నింటికీ ఎన్నికలు ఉంటాయి. పైగా అన్ని వర్గాల ప్రజల అభిప్రాయం కూడా వ్యక్తం అవుతుంది. అంతే కాదు వివిధ సామాజిక వర్గాల ఆలోచనలు ప్రభుత్వం తీరు పట్ల వారి భావాలు కూడా స్థానిక ఎన్నికలలో ఎంతో కొంత వ్యక్తం అయ్యే అవకాశాలు ఉన్నాయి. ఇక ఏపీలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్ళ పై దాటింది. స్థానిక ఎన్నికల నాటికి రెండున్నరేళ్ళకు చేరువ అవుతుంది. దాంతో ప్రజలలో ఏమైనా అసంతృప్తి ఉందా లేక వారికి ఏ మేరకు సంతృప్తి స్థాయిలు ఉన్నాయన్నది కూడా ప్రాక్టికల్ గా తెలుసుకునే వీలు కలుగుతుంది.

**పోటా పోటీగా :**

స్థానిక ఎన్నికల్లో రాజకీయ పార్టీలు పోటా పోటీగా వ్యూహ రచన చేస్తున్నాయి. తెలుగుదేశం పార్టీ అయితే ఇంటింటికీ తెలుగుదేశం అనే ఒక భారీ ప్రచార కార్యక్రమం చేపట్టింది. ఇది రెండు నెలల పాటు సాగనుంది. ఇదంతా స్థానిక ఎన్నికల కోసమే అన్నది తెలిసిందే. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమం అలాగే అభివృద్ధి వీటి మీద నేరుగా ఇళ్ళకు వెళ్ళి ఎమ్మెల్యేలు సీనియర్ నాయకులు వివరించడం అన్నది టీడీపీ వ్యూహంలో భాగంగా చూస్తున్నారు. ఆ మీదట ఎటూ ఎన్నికల ప్రచారం ఉంటుంది. ముందు గ్రౌండ్ లెవెల్ లో ఓటర్ కి ఒక పాజిటివ్ వైబ్ ని కలిగించేందుకే ఇంటింటికీ టీడీపీ అని అంటున్నారు.

**లోకేష్ రంగంలోకి :**

ఇక ఈసారి స్థానిక ఎన్నికల సమరంలో లోకేష్ నేరుగా రంగంలోకి దిగుతున్నారని అంటున్నారు. ఆయన టీడీపీ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్. ఒక విధంగా పార్టీని అంతా ఆయన చూస్తున్నారు. ఇంటింటికీ టీడీపీ కార్యక్రమం గురించి నిరంతరం సమీక్ష కూడా చేస్తున్నారు. ఇక లోకల్ బాడీ ఎన్నికల్లో వ్యూహరచనలో కూడా యువనేత బిజీగా ఉన్నారు. ఎన్నికల ప్రచారంలో లోకేష్ గట్టిగా పాల్గొనే చాన్స్ ఉందని అంటున్నారు. అలాగే అభ్యర్థుల ఎంపిక కానీ మేయర్ వంటి కీలక స్థానాలకు సమర్థులైన వారిని బరిలోకి దించడంలో కానీ లోకేష్ ఫుల్ ఫోకస్ పెట్టనున్నారు అని ప్రచారం సాగుతోంది. ఈ ఎన్నికల్లో అత్యధిక సీట్లు గెలిచి టీడీపీని తిరుగులేని స్థానంలో ఉంచాలని లోకేష్ పట్టుదలగా ఉన్నారని అంటున్నారు. ఒక విధంగా లోకేష్ సత్తాకు ఈ ఎన్నికలే ముందస్తు పరీక్ష అని చెబుతున్నారు.

**పవన్ పట్టుదలకు :**

జనసేన అంటే త్యాగాల పార్టీ కాదని పట్టుబట్టి సాధించుకునే పార్టీ అని పవన్ కళ్యాణ్ ఈసారి నిరూపించబోతున్నారు అని అంటున్నారు. అంతే కాకుండా అధిక సీట్లను పొత్తులో రాబట్టడమే కాకుండా 2024 నాటి సెంట్ పర్సెంట్ స్ట్రైక్ రేట్ సక్సెస్ ని రిపీట్ చేయాలని పవన్ చూస్తున్నారు అని అంటున్నారు. గ్రాస్ రూట్ లెవెల్ లో బలమైన పునాది వేసుకుని పార్టీని 2029 ఎన్నికల నాటికి తిరుగులేని శక్తిగా మార్చాలని పవన్ గట్టి సంకల్పం తీసుకున్నారని అంటున్నారు. ఒక విధంగా పవన్ ఇంత సీరియస్ గా ఎన్నికల వ్యూహాలను రచించడం అంటే జనసేన దూకుడు వేరే లెవెల్ అవుతుందని ఆ పార్టీ నేతలు విశ్వాసం వ్యక్తం చేస్తున్నారు. ఇక పవన్ వ్యూహాలకు ఎన్నికలలో జనసేన అందుకే ఫలితాలకు ఒక మచ్చుతునకగా లోకల్ ఫైట్ నిలుస్తుందని అంటున్నారు. అలా జరగాలని అంతా కోరుకుంటున్నారు.

**జగన్ సైతం సై అంటూ :**

జగన్ కూడా స్థానిక ఎన్నికల బరిలోకి సీరియస్ గానే అడుగు పెడుతున్నారు. సార్వత్రిక ఎన్నికల మీదనే ఎక్కువ ఫోకస్ పెట్టే జగన్ ఈసారి మాత్రం లోకల్ సత్తా చూపాలని తపన పడడం వైసీపీ రాజకీయ జాతకాన్ని మార్చనుందా అన్న చర్చ సాగుతోంది. అదే సమయంలో జగన్ 2024 నాటి చేదు ఫలితాలను నాటి అనుభవాలని మరిపించేలా లోకల్ బాడీ ఎన్నికల్లో ఫ్యాన్ పార్టీ జోరుని చూపించాలని అనుకుంటున్నారు. దాంతో తాను మాత్రమే దూకుడు చేయడం కాకుండా పార్టీని కూడా పరుగులు పెట్టించాలని చూస్తున్నారు. దాంతో ఈసారి స్థానిక సమరం ప్రధానంగా లోకేష్ జగన్ పవన్ ల మధ్యనే కేంద్రీకృతం అవనుంది అని అంటున్నారు.

# ప్రభుత్వ పాఠశాలలపై కూటమిది అబద్ధాల ప్రచారం

- మొదటి పేజి తరువాయి

కల్పించామని, విద్యార్థులకు బైజూస్ కంటెంట్‌తో ట్యాబ్‌లు, ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానెల్స్, స్మార్ట్ టీవీలు ఏర్పాటు చేశామని వివరించారు. ఆంగ్ల మాధ్యమాన్ని ప్రోత్సహిస్తూ టోఫెల్ వంటి అంతర్జాతీయ స్థాయి శిక్షణకు సైతం శ్రీకారం చుట్టామని తెలిపారు. కానీ నేడు కూటమి ప్రభుత్వంలో ప్రభుత్వ విద్యారంగం తిరోగమనంలో పయనిస్తుండటం ఆందోళనకరమని జగన్ అన్నారు. ప్రభుత్వ ప్రచారంలోని డొల్లతనాన్ని ఈ లెక్కలే బయటపెడుతున్నాయని ఆయన పేర్కొన్నారు.

# కాకినాడలో నర్సింగ్ విద్యార్థినుల ఘటనపై సీఎం చంద్రబాబు ఆరా

- మొదటి పేజి తరువాయి

అడిగి తెలుసుకున్నారు. ఏ సమస్య ఉన్నా జిల్లా యంత్రాంగం దృష్టికి తీసుకురావాలని జిల్లా కలెక్టర్ విద్యార్థులకు సూచించారు. ఫిర్యాదు చేస్తే విచారణ జరిపి వెంటనే తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అవసరమైన వసతి కల్పించడంతో పాటు.. పరిస్థితి మరింత ఉద్రిక్తం కాకుండా చర్యలు తీసుకున్నారు. అధికారుల చొరవతో సమస్య సామరస్యపూర్వకంగా పరిష్కారమైంది. అధికారులు స్పందించిన తీరుపై ఈశాన్య రాష్ట్రాలకు చెందిన విద్యార్థులు సంతృప్తి వ్యక్తం చేశారు.

**ఏం జరిగిందంటే?**

ఎస్‌కే కాలేజ్ ఆఫ్ నర్సింగ్‌లో విద్యార్థినుల మధ్య ఘర్షణ చోటుచేసుకుంది. తన ఫోన్ పోయిందంటూ మణిపూర్‌కు చెందిన ఓ విద్యార్థిని ఇటీవల సర్పవరం పోలీసులకు ఫిర్యాదు చేయడంతో వివాదం తలెత్తింది. ఫోన్ దొరికినప్పటికీ గొడవ సద్దుమణగకపోవడంతో ఏపీ, మణిపూర్ విద్యార్థినులు పరస్పరం ఘర్షణకు దిగారు. ఈ ఘటనలో పలువురికి గాయాలయ్యాయి.

# వందేమాతరం అంటే హిందూ దేవతల పూజ కాదు

'వందేమాతరం' గీతం పూర్తి రూపంలో ఆలపించడంపై వివాదం కొనసాగుతున్న నేపథ్యంలో, యోగా గురు బాబా రాందేవ్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఆ గీతంలోని సాహిత్యం హిందూ దేవతలైన దుర్గ, లక్ష్మి వంటి వారిని పూజించడం గురించి కాదని, కేవలం 'భారతమాత'కు చేసే ఆరాధన అని ఆయన ఆదివారం స్పష్టం చేశారు. ఉత్తరాఖండ్‌లోని హరిద్వార్‌లో జరిగిన ఓ కార్యక్రమంలో రాందేవ్ మాట్లాడుతూ.. "మేము భారతమాతనే దుర్గగా, లక్ష్మిగా భావిస్తాం. ఆమే మా విశ్వాసం, మా జ్ఞానం, మా ఆలయం. వందేమాతరంలో దేవతలను, ఆలయాలను చూసేవారు మన సంస్కృతికి దూరమైన వారు. భారతమాత ఆరాధనను దేవతలతో ముడిపెట్టి ఒక మతానికి వ్యతిరేకమని చెప్పడం మేధో దివాళాకోరుతనం" అని అన్నారు. విద్యార్థుల నిరసనల గురించి ప్రస్తావిస్తూ, చిన్న పిల్లలను నిరసనల్లోకి లాగడాన్ని ఆయన తప్పుబట్టారు. "5, 10 ఏళ్ల పిల్లలను కూడా పోలీస్ స్టేషన్లను ముట్టడించాలని, ఎస్పీలు, డీఎంలను ఘెరావ్ చేయాలని ప్రోత్సహిస్తున్నారు. ఇది సరైన పద్ధతి కాదు. అయితే, 18 ఏళ్లు నిండిన వారు ఎక్కడ అన్యాయం జరిగినా తప్పక పోరాడాలి" అని పిలుపునిచ్చారు.

ఈ సందర్భంగా కుల దూషణలపైనా రాందేవ్ స్పందించారు. "షెడ్యూల్డ్ కులాలు లేదా తెగల వారిని అవమానించడం రాజ్యాంగ విరుద్ధమైనప్పుడు, బ్రాహ్మణులను దూషించడం కూడా ప్రజాస్వామ్యానికి విరుద్ధమే" అని పేర్కొన్నారు. ఉత్తరాఖండ్‌లో ఉమ్మడి పౌర స్మృతి (యూసీసీ)ని అమలు చేసిన ముఖ్యమంత్రి పుష్కర్ సింగ్ ధామీని

ఆయన ప్రశంసించారు. ఇటీవల తన వ్యక్తిగత జీవితంపై వ్యాఖ్యలు చేయవద్దని బీజేపీ ఎంపీ కంగనా రనౌత్ చేసిన సూచనపై రాందేవ్ స్పందిస్తూ.. "స్వామి రాందేవ్ ఎవరో, ఆయన సేవ ఏంటో ఈ దేశ ప్రజలకు తెలుసు. అందువల్ల, అలాంటి స్థాయి వ్యక్తుల గురించి నేను ఎలాంటి వ్యాఖ్యలు చేయాలనుకోవడం లేదు" అని అన్నారు.

# కారుమూరి అరెస్ట్.. ప్రభుత్వ కక్షసాధింపు అంటూ విడదల రజని ఆగ్రహం

- మొదటి పేజి తరువాయి

అక్రమంగా అరెస్టు చేశారని రజని పేర్కొన్నారు. బీసీ నేత అయిన కారుమూరి కుటుంబాన్ని లక్ష్యంగా చేసుకుని, కొద్ది రోజుల క్రితం ఆయన కుమారుడు సునీల్‌ను కూడా అరెస్టు చేశారని, ఇప్పుడు ఆయనను అరెస్టు చేయడాన్ని పార్టీ తరఫున తీవ్రంగా ఖండిస్తున్నామని తెలిపారు. ఇద్దరు రిటైర్డ్ ఉన్నతాధికారులను కూడా అన్యాయంగా జైల్లో పెట్టారని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో మద్యం సరఫరా, విక్రయాలు పారదర్శకంగా జరిగాయని, దుకాణాల సంఖ్య తగ్గించడంతో పాటు అక్రమ మద్యాన్ని పూర్తిగా అరికట్టామని రజని స్పష్టం చేశారు. పర్మిట్ రూమ్‌లు, బెల్టు షాపులను నిర్మూలించామని గుర్తుచేశారు. అయితే, 2014-19 మధ్య చంద్రబాబు హయాంలో మద్యం సరఫరా, విక్రయాల్లో భారీగా అక్రమాలు జరిగాయని ఆమె ఆరోపించారు. బార్ల యజమానులకు అనుకూలంగా వ్యవహరించి, ప్రివిలేజ్ ఫీజులు మాఫీ చేసి ఖజానాకు నష్టం కలిగించారని విమర్శించారు. అప్పట్లో మద్యం అమ్మకాలు పెరిగినా ప్రభుత్వ ఆదాయం పెరగలేదని, ఆ అవకతవకలపై

చంద్రబాబుపై కేసు కూడా నమోదైందని తెలిపారు. ఆ కేసు నుంచి బయటపడటానికే, తమ ప్రభుత్వంపై లేనిపోని ఆరోపణలతో కేసులు బనాయించి ప్రజల దృష్టిని మళ్లించే ప్రయత్నం చేస్తున్నారని రజని విమర్శించారు. ప్రభుత్వం ఇప్పటికైనా తన వైఖరిని మార్చుకోవాలని హితవు పలికారు. లేనిపక్షంలో రాబోయే రోజుల్లో ప్రజలే తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు. కారుమూరి నాగేశ్వరరావును తక్షణమే విడుదల చేయాలని ఆమె డిమాండ్ చేశారు.

# జపాన్‌లో భూకంపం.. నిలిచిన పోయిన రైళ్లు.. ఆగిపోయిన విద్యుత్ సరఫరా

- మొదటి పేజి తరువాయి

ప్రాంతంలో 68 కిలోమీటర్ల లోతులో భూకంపం కేంద్రం నమోదైనట్లు క్యోడో న్యూస్ రిపోర్ట్ చేసింది. అయితే సునామీ ప్రమాదమేమీ లేదని జపాన్ భూకంప కేంద్రం తెలిపింది. భారీ కుదుపుల కారణంగా రైళ్లను ఎక్కడికక్కడ నిలిచిపోయాయి. స్టేషన్లలో ఉన్న ట్రైన్స్ షెడ్యూల్ డిలే చేశారు. ప్రజలు ప్రయాణాలను వాయిదా వేసుకోవాలని ప్రభుత్వ వర్గాలు పిలుపునిచ్చాయి. దీనికి తోడు విద్యుత్ సరఫరా నిలిపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. సెంట్రల్ టోక్యోలోని ఉయెనోను చిబా ప్రిఫెక్చర్‌లోని నరిటా ఎయిర్ పోర్ట్ ను కలిపే కీసే లైన్, ఉదయం 9:40 గంటల తర్వాత సాధారణ కార్యకలాపాలు మొదలైనట్లు క్యోడో న్యూస్ నివేదించింది. అయితే, టోబు రైల్వే ఎక్స్‌ప్రెస్ మార్గాలు నిలిచిపోయినట్లు వెల్లడించింది. ఈ భూకంపం కారణంగా 23 మంది గాయపడగా.. ఇద్దరు చనిపోయినట్లు ఫైర్, విపత్తు నిర్వహణ అధికారులు వెల్లడించారు. టోక్యోకు ఉత్తరాన ఉన్న సైతామా ప్రిఫెక్చర్‌లో ఒక యువకుడు, 70 ఏళ్ల ఒక మహిళ చనిపోయినట్లు తెలిపారు. రాజధానికి సరిగ్గా దక్షిణాన ఉన్న కవాసాకిలో ముగ్గురు వ్యక్తులు తీవ్రంగా గాయపడినట్లు పేర్కొన్నారు. భూకంపం వల్ల జరిగిన నష్టాన్ని నిర్ధారించి, ప్రజలకు సకాలంలో సమాచారాన్ని అందించేలా చూడాలని అధికారులను ఆదేశించారు ప్రధాని సనాయ్ తకైచి .

# బాహుబలి జేసీబీతో గచ్చిబౌలిలో ప్రమాదకర భవనం కూల్చివేసిన హైడ్రా

- మొదటి పేజి తరువాయి

అధికారులు కూల్చివేశారు. సీఎంసీ (సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్), హైడ్రా బృందాలు సంయుక్తంగా ఆదివారం ఉదయం ఈ ఆపరేషన్ చేపట్టాయి. శనివారం సాజిద్ అనే వ్యక్తికి చెందిన భవనం కూలిపోవడంతో, దాని శిథిలాలు పక్కనే ఉన్న మరో ఏడంతస్తుల భవనంపై పడ్డాయి. దీంతో ఆ భవనం కూడా తీవ్రంగా దెబ్బతిని, ఏ క్షణమైనా కూలిపోయే స్థితికి చేరింది. ఈ నిర్మాణం వల్ల చుట్టుపక్కల భవనాలకు, ప్రజలకు పెను ప్రమాదం పొంచి ఉందని సీఎంసీ అధికారులు నిర్ధారించారు. వారి అభ్యర్థన మేరకు హైడ్రా బృందాలు రంగంలోకి దిగి కూల్చివేత పనులను ప్రారంభించాయి. ఈ భవనాలు అత్యంత సమీపంలో, ఎలాంటి ఖాళీ స్థలం లేకుండా నిర్మించడంతో కూల్చివేత సవాలుగా మారింది. 'బాహుబలి' జేసీబీ వంటి భారీ యంత్రాలను ఉపయోగిస్తూ, సమీపంలోని ఇతర నిర్మాణాలకు ఎలాంటి నష్టం కలగకుండా అధికారులు జాగ్రత్తలు తీసుకుంటున్నారు. కూల్చివేత నేపథ్యంలో ముందుజాగ్రత్త చర్యగా, సమీపంలోని స్టెర్లింగ్ వైట్‌ఫీల్డ్ అపార్ట్‌మెంట్‌లోని నివాసితులను ఇళ్లు ఖాళీ చేయించారు. ఆ ప్రాంతంలోకి ప్రజలు రాకుండా పోలీసులు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. ఆంజనేయ నగర్‌లో ఎలాంటి అనుమతులు లేకుండా కేవలం 50 గజాల స్థలంలోనే ఏడంతస్తుల వరకు పేకమేడల్లా భవనాలు నిర్మించారని అధికారులు తెలిపారు. ఈ అక్రమ నిర్మాణాలు ప్రజల ప్రాణాలకు ముప్పుగా పరిణమించడంతో కఠిన చర్యలకు ఉపక్రమించారు. ఈ ఘటనతో అక్రమ నిర్మాణాలపై అధికారులు ఉక్కుపాదం మోపుతున్నట్లు స్పష్టమవుతోంది.

# ఏపీ లిక్కర్ రవాణా స్కాం: మాజీ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు అరెస్ట్

- మొదటి పేజి తరువాయి

ఏపీలో మద్యం రవాణా టెండర్ల ప్రక్రియలో భారీగా అవకతవకలు జరిగాయన్నది ప్రధాన ఆరోపణ. టెండర్ నిబంధనలను ఉద్దేశపూర్వకంగా మార్చి, సిగ్మా సప్లై చైన్ సొల్యూషన్స్, ప్రసాద్ ట్రాన్స్‌పోర్ట్స్ వంటి సంస్థలకు అనుకూలంగా వ్యవహరించారని ఈడీ తన దర్యాప్తులో గుర్తించింది. మార్కెట్ రేట్ల కన్నా ఎక్కువ ధరకు కాంట్రాక్టులు కట్టబెట్టడం ద్వారా ప్రభుత్వ ఖజానాకు సుమారు రూ.195.33 కోట్ల నష్టం వాటిల్లినట్లు ఏపీ సీఐడీ నమోదు చేసిన ఎఫ్‌ఐఆర్ ఆధారంగా ఈడీ విచారణ కొనసాగిస్తోంది. ఈ మొత్తం వ్యవహారంలో రాజ్ కెసిరెడ్డి, అప్పటి ఏపీ బేవరేజెస్ కార్పొరేషన్ ఎండీ దొంతిరెడ్డి వాసుదేవరెడ్డి కీలకపాత్ర పోషించినట్లు ఈడీ ఆరోపిస్తోంది. ఈ సిండికేట్‌లో మాజీ మంత్రి కారుమూరి, ఆయన కుమారుడు సునీల్ కుమార్‌కు కూడా వాటా ఉందని, వారి కుటుంబానికి సుమారు రూ.10 కోట్లకు పైగా ముడుపులు అందినట్లు దర్యాప్తు సంస్థ అనుమానిస్తోంది.

ఈ కేసులో భాగంగా జూన్ నెలలో ఈడీ విస్తృతంగా తనిఖీలు చేపట్టింది. మొదట రాజ్ కెసిరెడ్డి, వాసుదేవరెడ్డిలను అరెస్ట్ చేసింది. అనంతరం కారుమూరి నాగేశ్వరరావు కుమారుడు సునీల్ కుమార్‌ను కూడా అదుపులోకి తీసుకుంది. ఇప్పుడు మాజీ మంత్రి కారుమూరిని కూడా అరెస్ట్ చేయడంతో ఈ కేసు దర్యాప్తు మరింత వేగవంతం కానుంది.

# బంగాళాఖాతంలో అల్పపీడనం.. ఉత్తరాంధ్రకు వర్ష సూచన, మత్స్యకారులకు హెచ్చరిక

- మొదటి పేజి తరువాయి

నేడు, రేపు పలుచోట్ల మోస్తరు నుంచి ఓ మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొంది. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించింది. పశ్చిమ బెంగాల్, ఒడిశా, ఉత్తరాంధ్ర తీర ప్రాంతాల వెంబడి గంటకు 40 నుంచి 50 కిలోమీటర్ల వేగంతో బలమైన ఈదురు గాలులు వీచే అవకాశం ఉందని ఏపీఎస్డీఎంఏ తెలిపింది. సముద్రం అలజడిగా ఉండి, కెరటాలు ఎగసిపడే ప్రమాదం ఉన్నందున మత్స్యకారులు వేటకు వెళ్లరాదని స్పష్టమైన హెచ్చరికలు జారీ చేసింది. ఐఎండీ నివేదిక ప్రకారం, ఆగస్టు 23, ఆదివారం ఉదయం నాటికి ఈ అల్పపీడనం వాయువ్య బంగాళాఖాతంలోనే స్థిరంగా కొనసాగుతోంది. దీనికి అనుబంధంగా ఏర్పడిన ఉపరితల ఆవర్తనం సముద్ర మట్టానికి 7.6 కిలోమీటర్ల ఎత్తు వరకు విస్తరించి ఉంది. రుతుపవన ద్రోణి కూడా ఈ అల్పపీడన ప్రాంతం మీదుగా కొనసాగుతుండటంతో దీని ప్రభావం స్పష్టంగా కనిపిస్తోంది. ఈ వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో తీరప్రాంత ప్రజలు, అధికారులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని విపత్తుల నిర్వహణ సంస్థ సూచించింది.

# బంగ్లాదేశ్‌లో ఘోరం.. హిందూ టీచర్ ఫ్యామిలీ దారుణ హత్య

- మొదటి పేజి తరువాయి

ఈ క్రమంలో నాలుగేళ్ల క్రితం రంగ్‌పుర్‌లో కొత్త ఇంటిని నిర్మించుకుని భార్య ప్రీతిలత (50), కుమార్తె అగామీ (23), కుమారుడు ప్రియమ్ (12)తో కలిసి ఉంటున్నారు. చక్రవర్తి భార్య ప్రీతిలతకు ఆమె సోదరి ఫోన్ చేయగా స్విచ్ఛాఫ్ వచ్చింది. మిగతా కుటుంబ సభ్యుల ఫోన్లు సైతం కలవకపోవడంతో ఆందోళనకు గురైన ఆమె పోలీసులకు సమాచారం చేరవేశారు. పోలీసులు శనివారం రాత్రి తాళం వేసి ఉన్న ఆ ఇంటి తలుపులను పగలగొట్టి చూడగా నలుగురు హత్యకు గురై కనిపించారు. చక్రవర్తి మృతదేహం ఇంటి పైకప్పు మీద, భార్య, కుమార్తె మృతదేహాలు మెట్లపై, కుమారుడి మృతదేహం ఇంట్లోని మంచం కింద లభ్యమయ్యాయి. గురువారం రాత్రి ఈ హత్యలు జరిగినట్లు పోలీస్ కమిషనర్ మహ్మద్ అబ్దుల్ తెలిపారు. ఇద్దరు దుండగులు డ్రగ్స్ తీసుకోవడానికి చక్రవర్తి ఇంటిపైకి వెళ్లారు. దాన్ని గమనించిన గణపతి వారిని ప్రశ్నించడంతో తమను గుర్తుపట్టారని, టవల్‌తో మెడకు చుట్టి ఊపిరాడకుండా చేసి హత్య చేశారు. ఈ క్రమంలో శబ్దం రావడంతో భార్య ప్రీతిలత పైకి వెళ్లగా ఆమెను సైతం గొంతునులిమి హత్య చేశారు. అనంతరం వారి పిల్లలను చంపారు. ఈ ఘటనకు సంబంధించి ఇద్దరు అనుమానితులను గుర్తించి విచారిస్తున్నట్లు తెలిపారు.

# అంతరిక్షంలో భారత్ 'నిఘా నేత్రాలు'.. శత్రు క్షిపణులకు సెకన్లలోనే చెక్!

- మొదటి పేజి తరువాయి

లభిస్తుంది. గతంలో జరిగిన 'ఆపరేషన్ సిందూర్' ఈ కొత్త వ్యవస్థ ఆవశ్యకతను స్పష్టం చేసింది. ఆ సమయంలో పాకిస్థాన్ ప్రయోగించిన ఒక హై-స్పీడ్ క్షిపణి ఢిల్లీ వైపు దూసుకొస్తుండగా, హర్యానాలోని సిర్సా వద్ద భారత వాయు రక్షణ వ్యవస్థ దానిని అడ్డగించింది. అయితే, క్షిపణి లక్ష్యాన్ని చేరడానికి కేవలం ఒకటి, రెండు నిమిషాల సమయం మాత్రమే ఉండగా ఈ అడ్డగింత సాధ్యమైంది. భూమిపై ఉన్న రాడార్లు భూమి వక్రత (ఎబతీఒఞబతీవ) కారణంగా ఒక పరిమితి మేరకే పనిచేస్తాయి. దీంతో ముప్పును గుర్తించడానికి తక్కువ సమయం ఉంటుంది. ఈ సమస్యను అధిగమించి, శత్రువు దాడిని ముందుగానే పసిగట్టడమే అంతరిక్ష ఆధారిత సెన్సార్ల ప్రధాన లక్ష్యం.

**వ్యవస్థ పనిచేసే విధానం**

బాలిస్టిక్ క్షిపణులు ప్రధానంగా మూడు దశల్లో ప్రయాణిస్తాయి. మొదటిది 'బూస్ట్' దశ. ఈ సమయంలో ఇంజిన్లు మండి, తీవ్రమైన వేడిని విడుదల చేస్తాయి. అంతరిక్షంలోని ఇన్‌ఫ్రారెడ్ సెన్సార్లు ఈ వేడిని ప్రయోగించిన సెకన్ల వ్యవధిలోనే గుర్తిస్తాయి.

రెండోది 'మిడ్‌కోర్స్' దశ. ఈ దశలో క్షిపణి వాతావరణం బయట ప్రయాణిస్తుంది.

మూడోది 'టెర్మినల్' దశ. ఈ దశలో క్షిపణి అత్యంత వేగంతో (మాక్ 15కు పైగా) లక్ష్యం వైపు దూసుకొస్తుంది.

భూస్థిత రాడార్లు కేవలం టెర్మినల్ దశలోనే క్షిపణిని గుర్తించగలవు. కానీ అంతరిక్షంలోని ఉపగ్రహాలు బూస్ట్ దశలోనే గుర్తించి హెచ్చరికలు పంపుతాయి. దీనివల్ల 'కిల్ చైన్' (గుర్తించడం, ట్రాక్ చేయడం, ధ్వంసం చేయడం) ప్రక్రియ చాలా ముందుగా ప్రారంభమవుతుంది. దీంతో వాతావరణం లోపల, వెలుపల కూడా క్షిపణిని కూల్చివేసేందుకు అవకాశం లభిస్తుంది. డీఆర్‌డీఓ ఇప్పటికే ఇటువంటి క్షిపణి విధ్వంసక పరీక్షలను విజయవంతంగా నిర్వహించింది.

**ప్రభుత్వ, ప్రైవేట్ భాగస్వామ్యం**

ఈ అత్యాధునిక వ్యవస్థ రూపకల్పనలో భారత ప్రభుత్వం, ప్రైవేట్ స్టార్టప్‌లు కలిసి పనిచేస్తున్నాయి. బెంగళూరుకు చెందిన 'దిగంతర' స్టార్టప్ 'ఆల్బట్రాస్' ఉపగ్రహాలతో బూస్ట్ దశలోనే క్షిపణులను గుర్తించే సాంకేతికతపై పనిచేస్తోంది. అహ్మదాబాద్‌కు చెందిన 'శాట్‌లియో ల్యాబ్స్' 15 ఉపగ్రహాలతో కూడిన థర్మల్ అబ్జర్వేషన్ వ్యవస్థను నిర్మిస్తోంది. ఇవి క్షిపణి ప్రయోగం వంటి అత్యధిక ఉష్ణోగ్రత ఘటనలను గుర్తించి, రియల్ టైమ్‌లో సమాచారం అందిస్తాయి. ఈ ప్రైవేట్ ప్రయత్నాలకు తోడుగా, కేంద్ర భద్రతా కేబినెట్ కమిటీ (జజూ) 'స్పేస్-బేస్డ్ సర్వైలెన్స్ ఫేజ్-3' (ఎస్‌బీఎస్-3) అనే భారీ కార్యక్రమానికి ఆమోదం తెలిపింది. సుమారు రూ.27,000 కోట్ల వ్యయంతో 2029 నాటికి 52 ఉపగ్రహాల (21 ఇస్రో, 31 ప్రైవేట్) సమూహాన్ని అంతరిక్షంలో మోహరించనున్నారు. ఈ నెట్‌వర్క్ నిరంతర నిఘా, శత్రువుల మొబైల్ లాంచర్ల ట్రాకింగ్, కమ్యూనికేషన్స్ వంటి బహుళ ప్రయోజనాలకు ఉపయోగపడుతుంది. ఈ బహుళ అంచెల రక్షణ వ్యూహం ద్వారా శత్రువు ఆకస్మిక దాడులు చేసే అవకాశాలను తగ్గించి, భారత రక్షణ సామర్థ్యాన్ని అసాధారణ స్థాయికి తీసుకెళ్లాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది.

పెన్ పవర్
కాకినాడ
డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా

# ప్రజా సమస్యల పరిష్కారానికి ఆగస్టు 24న యథావిధిగా పీజీఆర్ఎస్, రెవెన్యూ క్లినిక్

**1100 టోల్‌ఫ్రీ నంబర్, మీ సేవ పోర్టల్ ద్వారా కూడా అర్జీల నమోదుకు అవకాశం**

**క్యూఆర్ కోడ్ స్కానర్ ద్వారా స్పందన తెలియజేయాలి**

**కలెక్టర్ హరేంధిర ప్రసాద్**




**కాకినాడ, పెన్ పవర్,ఆగస్టు 23:** ప్రజల సమస్యల పరిష్కారం కోసం ప్రతి సోమవారం నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదిక , భూ సంబంధిత ఫిర్యాదుల పరిష్కార వేదిక (రెవెన్యూ క్లినిక్) కార్యక్రమాలు ఆగస్టు 24న సోమవారం జిల్లాలో యథావిధిగా నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ తెలిపారు.
జిల్లా స్థాయిలో పీజీఆర్ఎస్ కార్యక్రమం సోమవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు కాకినాడ కలెక్టరేట్‌లోని గ్రీవెన్స్ హాలులో, రెవెన్యూ క్లినిక్‌ను వివేకానంద హాలులో నిర్వహించనున్నట్లు తెలిపారు. జిల్లా స్థాయి అన్ని శాఖల అధికారులు విధిగా ఈ కార్యక్రమాలకు హాజరు కావాలని కలెక్టర్ ఆదేశించారు. ఇప్పటికే అర్జీలు దాఖలు చేసినప్పటికీ పరిష్కారం కాని సమస్యలు, ఫిర్యాదులకు సంబంధించిన సమాచారం తెలుసుకునేందుకు అర్జీదారులు 1100 టోల్‌ఫ్రీ నంబర్‌కు ఫోన్ చేసి సంప్రదించవచ్చన్నారు. అలాగే వీవవనిశీయిఎ.ఖజూ.స్త్రశీజ.అఅ వెబ్‌సైట్ ద్వారా అర్జీలను ఆన్‌లైన్‌లో నమోదు చేసుకునే అవకాశం ఉందని తెలిపారు.
రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా రూపొందించిన క్యూఆర్ కోడ్ స్కానర్ ద్వారా తమ స్పందనను తెలియ జేయాలని కలెక్టర్ సూచించారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా అర్జీల స్వీకరణ కార్యక్రమాన్ని జిల్లా కేంద్రంతో పాటు డివిజన్,మండల, మున్సిపల్ స్థాయిలో కూడా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అర్జీదారులు తమ ఫిర్యాదులను సమీపంలోని డివిజన్, మండల కార్యాలయాలు లేదా మున్సిపల్ కార్యాలయాల్లో కూడా సమర్పించ వచ్చని కలెక్టర్ పేర్కొన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని తమ సమస్యలకు పరిష్కారం పొందాలని కోరారు.

## పెదశంకర్లపూడిలో ఎమ్మెల్యే సత్యప్రభకు వెన్నా శివ ఆధ్వర్యంలో ఘన సన్మానం.








**-కత్తిపూడిలో పీహెచ్‌సీ కోసం అసెంబ్లీలో ప్రస్తావించడం పట్ల హర్షం.**

**కిర్లంపూడి/ప్రత్తిపాడు, పెన్ పవర్, ఆగస్టు 23:** శంఖవరం మండలం కత్తిపూడిలో పీహెచ్‌సీ ఏర్పాటు చేయాలన్న ప్రజల విజ్ఞప్తిని అసెంబ్లీలో ప్రస్తావించి,ఆరోగ్యశాఖ మంత్రి దృష్టికి తీసుకెళ్లిన ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభరాజాకు ప్రత్తిపాడు మండలం పెదశంకర్లపూడిలో రాష్ట్ర రోడ్డు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ వెన్నా శివ ఆధ్వర్యంలో ఆదివారం ఘన సన్మాన కార్యక్రమం నిర్వహించారు. పెదశంకర్లపూడి టీడీపీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో సుమారు వంద మందికి పైగా పాల్గొని ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. కత్తిపూడిలో పీహెచ్‌సీ ఏర్పాటు చేస్తే జాతీయ రహదారిపై జరిగే ప్రమాదాల్లో గాయపడిన వారికి తక్షణ ప్రాథమిక వైద్యం అందే అవకాశం ఉంటుందని వెన్నా శివ పేర్కొన్నారు. ప్రజల విజ్ఞప్తికి స్పందించి అసెంబ్లీ వేదికగా కత్తిపూడి పీహెచ్‌సీ అంశాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లిన ఎమ్మెల్యే సత్యప్రభకు ధన్యవాదాలు తెలిపారు. పీహెచ్‌సీ ఏర్పాటుకు ప్రభుత్వం త్వరితగతిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీనియర్ టీడీపీ నాయకులు బద్ది రామారావు,కత్తిపూడి సొసైటీ అధ్యక్షులు గాబు కృష్ణమూర్తి,మాజీ ఎంపీటీసీలు సాదనాల లక్ష్మిబాబు,కంచిబోయిన శ్రీను,మార్కెట్ కమిటీ డైరెక్టర్ నాయుడు సూరిబాబు,కత్తిపూడి టౌన్ ప్రెసిడెంట్ కేళంగి జన,కొయ్యా రమణ,కత్తిపూడి యూత్ ప్రెసిడెంట్ గాబు శివ,యువ నాయకులు రౌతు శివ,నాయుడు బుజ్జి,మచ్చా కొండ తదితరులు పాల్గొన్నారు.

# మాగంలో 'మద్యం' దందా గుట్టురట్టు!





**యానాం మద్యం తెచ్చి బ్రాండెడ్ బాటిళ్లలో రీ-ఫిల్లింగ్?**

**ఎక్సైజ్ దాడులతో కలకలం.. వైన్ షాప్ సీజ్, ముగ్గురు అరెస్ట్**

**అక్రమాలపై ఇన్నాళ్లూ ఎందుకు నిఘా పెట్టలేదంటున్న గ్రామస్తులు**

**పెన్ పవర్ ,ప్రతినిధి పి.గన్నవరం, ఆగస్టు 23:** అంబేద్కర్ కోనసీమ జిల్లా అయినవిల్లి మండలం మాగం గ్రామంలో యానాం మద్యం విక్రయాల వ్యవహారం కలకలం రేపుతోంది. గ్రామంలోని రత్న వైన్ షాప్‌లో యానాం నుంచి మద్యం తీసుకొచ్చి, ఇక్కడి బ్రాండెడ్ మద్యం బాటిళ్లలో నింపి విక్రయిస్తున్నారన్న సమాచారంతో ఎక్సైజ్ అధికారులు దాడులు నిర్వహించారు. ఈ తనిఖీల్లో 58 యానాం మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకుని, వైన్ షాప్‌ను సీజ్ చేశారు. వ్యవహారానికి సంబంధించి ముగ్గురిని అరెస్ట్ చేసినట్లు అధికారులు తెలిపారు.

రహస్య సమాచారం.. ఆకస్మిక దాడి

యానాం నుంచి తక్కువ ధరకు మద్యం తీసుకొచ్చి స్థానికంగా బ్రాండెడ్ పేర్లతో విక్రయిస్తున్నారన్న సమాచారంతో ఎక్సైజ్ అధికారులు నిఘా పెట్టినట్లు తెలుస్తోంది. పక్కా సమాచారంతో రత్న వైన్ షాప్‌పై ఆకస్మికంగా దాడి చేయడంతో అక్రమ మద్యం వ్యవహారం వెలుగులోకి వచ్చింది. స్వాధీనం చేసుకున్న మద్యం బాటిళ్లపై అధికారులు తదుపరి విచారణ చేపట్టారు.

నలువైపులా రహదారులతో అక్రమ రవాణాకు అవకాశం?

మాగం గ్రామానికి పలు వైపుల నుంచి రహదారి సౌకర్యం ఉండటంతో ఇతర ప్రాంతాల నుంచి అక్రమంగా మద్యం తరలించేందుకు అవకాశం ఏర్పడుతోందని స్థానికులు చెబుతున్నారు. గత కొంతకాలంగా యానాం నుంచి మద్యం తీసుకొచ్చి స్థానికంగా విక్రయిస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయని, ఈ వ్యవహారంపై సమగ్ర దర్యాప్తు చేయాలని వారు కోరుతున్నారు.

వైన్ షాప్ చుట్టూ ఆక్రమణల ఆరోపణలు

మద్యం విక్రయాల వ్యవహారంతో పాటు వైన్ షాప్ పరిసరాల్లో ఆక్రమణలు, అనధికార నిర్మాణాలపై కూడా స్థానికులు ఆరోపణలు చేస్తున్నారు. షాప్ ఎదురుగా ఉన్న పంట బోదెను ఆక్రమించి నిర్మాణాలు చేపట్టి పార్కింగ్, ఫాస్ట్‌ఫుడ్ కేంద్రాలు నిర్వహిస్తున్నారని కొందరు గ్రామస్తులు పేర్కొంటున్నారు. అయితే ఈ ఆరోపణలపై సంబంధిత అధికారులు అధికారికంగా స్పందించాల్సి ఉంది.


సమగ్ర దర్యాప్తు చేయాలని డిమాండ్

ఇన్నాళ్లుగా ఆరోపణలు వినిపిస్తున్నా సంబంధిత శాఖలు ఎందుకు ముందస్తు చర్యలు తీసుకోలేదని గ్రామస్తులు ప్రశ్నిస్తున్నారు. తాజాగా ఎక్సైజ్ అధికారులు దాడులు నిర్వహించి షాప్‌ను సీజ్ చేయడంతో పాటు ముగ్గురిని అరెస్ట్ చేయడం ఆహ్వానించదగ్గ పరిణామమని, అయితే వ్యవహారం ఇక్కడితో ఆగకుండా యానాం మద్యం ఎక్కడి నుంచి వస్తోంది? ఎవరి ద్వారా సరఫరా అవుతోంది? బ్రాండెడ్ బాటిళ్లలోకి ఎలా రీ-ఫిల్లింగ్ చేస్తున్నారు? అనే అంశాలపై లోతైన దర్యాప్తు జరపాలని ప్రజలు కోరుతున్నారు.
అక్రమ మద్యం రవాణా, విక్రయాలకు అడ్డుకట్ట వేయడంతో పాటు వైన్ షాప్ పరిసరాల్లోని ఆక్రమణలపై కూడా సంబంధిత అధికారులు సమగ్ర విచారణ జరిపి, నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు.

## ఎక్సెల్ బండ్లు ఢీ.. వృద్ధుడి మృతి

**గండేపల్లి, పెన్ పవర్ ఆగస్టు 22:** జగ్గంపేట--రాజమహేంద్రవరం రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వృద్ధుడు మృతి చెందాడు. పోలీసుల వివరాల ప్రకారం.. మురారి గ్రామానికి చెందిన శిలం భద్రరావు (75) శనివారం సాయంత్రం 5 గంటల సమయంలో ఎక్సెల్ బండిపై జగ్గంపేట నుంచి రాజమహేంద్రవరం వైపు వెళ్తున్నారు.
ఈ క్రమంలో ఆయన రాంగ్‌రూట్‌లో రావడంతో, ఎదురుగా రాజమహేంద్రవరం వైపు వెళ్తున్న మరో ఎక్సెల్ బండి ఢీకొంది. ప్రమాదంలో భద్రరావు తలకు తీవ్ర రక్తగాయమైంది. మరో వాహనదారుడికి కూడా గాయాలయ్యాయి. ఇద్దరినీ అంబులెన్స్‌లో ఆసుపత్రికి తరలిస్తుండగా భద్రరావు మార్గమధ్యలో మృతి చెందారు.
మృతుడి భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు గండేపల్లి ఎస్సై యు.వి. శివనాగబాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# ఆపదలో అండగా... చదువుకు భరోసాగా




- నిరుపేద విద్యార్థినికి ఉన్నత చదువుల కోసం రూ.20 వేల ఆర్థిక సహాయం
- మంత్రి సుభాష్



**రామచంద్రపురం,పెన్ పవర్,ఆగస్టు 23:** మానవత్వం,సేవా దృక్పథానికి ప్రతీకగా రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ మరోసారి తన పెద్ద మనసును చాటుకున్నారు. నిరుపేద కుటుంబానికి చెందిన విద్యార్థిని ఉన్నత విద్యాభ్యా సానికి అండగా నిలుస్తూ రూ. 20 వేల ఆర్థిక సహాయం అందించి ఆమె భవిష్యత్తుకు భరోసా కల్పించారు.
రామచంద్రపురం నియోజకవర్గంలోని కే.గంగవరం మండలం శేరులంక గ్రామానికి చెందిన చింతలపూడి మహాలక్ష్మి కుటుంబం తీవ్ర ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటోంది. మహాలక్ష్మి తండ్రి దివ్యాంగుడు కాగా, కుటుంబ పోషణ కోసం బెంగళూరులో ప్రైవేటు ఉద్యోగం చేస్తున్న ఆమె సోదరుడు చింతలపూడి సాయి దుర్గారావు రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. ఈ విషాద ఘటన గురించి తెలుసుకున్న మంత్రి సుభాష్ గతంలో ఆ కుటుంబాన్ని పరామర్శించి వారి కష్టాలను తెలుసుకున్నారు. ఆ సమయంలో రూ. 50 వేల ఆర్థిక సహాయం అందించడంతో పాటు మహాలక్ష్మి విద్యాభ్యాసానికి అండగా ఉంటానని హామీ ఇచ్చారు. ఇచ్చిన మాటను నిలబెట్టుకుంటూ ఆదివారం రామచంద్రపురంలోని తన క్యాంపు కార్యాలయంలో మహాలక్ష్మికి రూ. 20 వేల ఆర్థిక సహాయం అందజేశారు.
ప్రస్తుతం మహాలక్ష్మి ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ కోర్సు అభ్యసిస్తోంది. ఆర్థిక ఇబ్బందుల కారణంగా ఆమె చదువుకు ఆటంకం కలగకుండా విద్యాభ్యాసాన్ని కొనసాగించేందుకు ఈ ఆర్థిక సహాయం ఉపయోగపడనుంది. ఈ సందర్భంగా మంత్రి సుభాష్ మాట్లాడుతూ పేదరికం కారణంగా ఏ విద్యార్థి చదువును మధ్యలోనే నిలిపివేయాల్సిన పరిస్థితి రాకూడదన్నారు. విద్యే జీవితాన్ని మార్చగల గొప్ప ఆయుధమని, ప్రతిభ ఉన్న ప్రతి విద్యార్థికి అండగా నిలవడం సమాజ బాధ్యత అని పేర్కొన్నారు.
కష్టాల్లో ఉన్న కుటుంబాలకు అండగా నిలవడం,నిరుపేద విద్యార్థుల విద్యకు సహాయం చేయడం,ఆపదలో ఉన్నవారికి భరోసా కల్పించడం వంటి సేవా కార్యక్రమాలను మంత్రి సుభాష్ నిరంతరం కొనసాగిస్తున్నారని స్థానికులు పేర్కొన్నారు. మహాలక్ష్మికి ఆర్థిక సహాయం అందించినందుకు కుటుంబ సభ్యులు మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. ఆపదలో అండగా... చదువుకు భరోసాగా నిలిచిన మంత్రి సుభాష్ మానవతా దృక్పథంపై విద్యార్థిని కుటుంబ సభ్యులు, కూటమి పార్టీల నాయకులు హర్షం వ్యక్తం చేశారు. మంత్రి సుభాష్ వెంట పట్టణ అధ్యక్షుడు ఉండవెల్లి శివ,రూరల్ మండల అధ్యక్షుడు కొత్తపల్లి శ్రీనుబాబు, కొండేపూడి అర్జున్ తదితరులు ఉన్నారు.

# కోనసీమ తిరుమల వాడపల్లిలో సీబీసీఐడీ ఎస్పీ రెడ్డి గంగాధర్





**శ్రీ స్వామివారి సన్నిధిలో ప్రత్యేక పూజలు.. వేదాశీర్వచనం**

**ఆత్రేయపురం పెన్ పవర్ ఆగస్టు 23:** ఆధ్యాత్మిక వైభవానికి, భక్తుల విశ్వాసానికి ప్రతీకగా నిలిచిన కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీ వేంకటేశ్వర స్వామివారి పుణ్యక్షేత్రాన్ని విజయవాడకు చెందిన సీబీసీఐడీ ఎస్పీ రెడ్డి గంగాధర్ దర్శించుకున్నారు. భక్తుల కొంగుబంగారంగా, ఏడువారాల స్వామిగా వాడపల్లి వెంకన్న సన్నిధికి ఆయన విచ్చేయడంతో ఆలయ ప్రాంగణంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. వాడపల్లి క్షేత్రం భక్తుల విశ్వాసంతో విశేష ప్రాధాన్యం సంతరించుకున్న పుణ్యక్షేత్రంగా కొనసాగుతోంది.

ఆలయానికి చేరుకున్న ఎస్పీ రెడ్డి గంగాధర్‌కు దేవస్థాన అధికారులు, అర్చకులు సంప్రదాయబద్ధంగా స్వాగతం పలికారు. ఆయనకు ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేసి, శ్రీదేవి భూదేవి సమేత శ్రీ వేంకటేశ్వర స్వామివారి మూలవిరాట్‌ను దర్శించుకునే అవకాశం కల్పించారు. స్వామివారి సన్నిధిలో ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించి, భక్తిశ్రద్ధలతో మొక్కులు చెల్లించుకున్నారు. పూజా కార్యక్రమాల అనంతరం ఆలయ వేద పండితులు శాస్త్రోక్తంగా వేదాశీర్వచనం అందించారు. దేవస్థాన అధికారులు ఆలయ సంప్రదాయాలకు అనుగుణంగా ఆలయ మర్యాదలు నిర్వహించి, స్వామివారి తీర్థప్రసాదాలను ఎస్పీ రెడ్డి గంగాధర్‌కు అందజేశారు.

గోదావరి తీరాన వెలసిన వాడపల్లి శ్రీ వేంకటేశ్వర స్వామివారి ఆలయం 'కోనసీమ తిరుమల'గా ప్రసిద్ధి చెందింది. వరుసగా ఏడు శనివారాలు స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లిస్తే కోరికలు నెరవేరుతాయన్న భక్తుల విశ్వాసం ఈ క్షేత్రానికి ప్రత్యేక గుర్తింపును తీసుకొచ్చింది.

ప్రత్యేక దర్శనం అనంతరం ఆలయ అధికారులు, అర్చకులతో ఎస్పీ రెడ్డి గంగాధర్ కొద్దిసేపు మాట్లాడారు. భక్తి, సంప్రదాయం, ఆధ్యాత్మికతకు ప్రతీకగా నిలిచిన వాడపల్లి క్షేత్ర దర్శనం ప్రశాంతమైన అనుభూతిని కలిగించిందన్న భావన వ్యక్తమైనట్లు ఆలయ వర్గాలు తెలిపాయి.

## గండేపల్లి మండలంలో 192 పోలింగ్ స్టేషన్ల ముసాయిదా జాబితా



**గండేపల్లి, పెన్ పవర్, ఆగస్టు, 23** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు గ్రామ పంచాయతీల సాధారణ ఎన్నికలు--2026కు సంబంధించి గండేపల్లి మండలంలోని 18 గ్రామ పంచాయతీలకు 192 పోలింగ్ స్టేషన్ల ముసాయిదా జాబితాను ఆదివారం ప్రచురించారు. మండల పరిషత్ కార్యాలయ నోటీసు బోర్డుతో పాటు ఆయా గ్రామ పంచాయతీ కార్యాలయాల నోటీసు బోర్డుల్లో, ప్రతి గ్రామంలో రెండు ముఖ్యమైన ప్రదేశాల్లో ఈ జాబితాను ప్రజల పరిశీలనకు అందుబాటులో ఉంచారు.

అభ్యంతరాలు ఉంటే లిఖితపూర్వకంగా ఇవ్వాలి

ముసాయిదా పోలింగ్ స్టేషన్ల జాబితాపై ప్రజలకు ఏవైనా సూచనలు, అభ్యంతరాలు ఉంటే ఆగస్టు 24 నుంచి 26వ తేదీలోపు లిఖితపూర్వకంగా గండేపల్లి మండల పరిషత్ అభివృద్ధి అధికారి హరికృష్ణ సత్య రెడ్డి కి సమర్పించాలని అధికారులు తెలిపారు. గడువు అనంతరం వచ్చిన అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకోబోమని, ప్రజలు నిర్ణీత గడువులో తమ సూచనలు, అభ్యంతరాలను తెలియజేయాలని సూచించారు.ద

### ఎస్‌కే కాలేజ్ ఆఫ్ నర్సింగ్ విద్యార్థుల వసతి గృహం పరిశీలన

* కలెక్టర్ హరేంధిర ప్రసాద్



**కాకినాడ పెన్ పవర్,ఆగస్టు 23:** శనివారం మొబైల్ ఫోన్ మిస్సింగ్ విషయంలో విద్యార్థుల మధ్య జరిగిన వివాదంపై జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్, జిల్లా ఎస్పీ బిందు మాధవ్ జోక్యం చేసుకుని పరిస్థితిని అదుపులోకి తీసుకువచ్చిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఆదివారం ఉదయం కలెక్టర్ ఎస్‌కే కాలేజ్ ఆఫ్ నర్సింగ్ విద్యార్థుల వసతి గృహాన్ని పరిశీలించి, విద్యార్థులతో మాట్లాడి వారి పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులు తమకు ఎలాంటి సమస్య లేదని, సురక్షితంగా ఉన్నామని కలెక్టర్‌కు తెలిపారు. ఏదైనా సమస్య ఉంటే వెంటనే జిల్లా యంత్రాంగం దృష్టికి తీసుకురావాలని కలెక్టర్ విద్యార్థులకు సూచించారు.

## రాష్ట్ర స్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు గొల్లపాలెం హైస్కూల్ క్రీడాకారులు





**కాజులూరు, పెన్ పవర్,ఆగస్టు 23**: జడ్పీహెచ్ఎస్ జి.వేమవరం వేదికగా ఆదివారం జిల్లా సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన సబ్‌జూనియర్, జూనియర్ విభాగాల జిల్లా స్థాయి ఎంపిక పోటీల్లో గొల్లపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు విశేష ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు.

సబ్‌జూనియర్ విభాగంలో జె. జయకృష్ణ, డి. ఆదర్శ్, ఎం. హరి ప్రసాద్, ఎ. ప్రదీప్, కె. లోకేశ్వరి దీపిక, డి. సంగీత, బి. మేఘన, పి. వినీత, బి. ప్రసన్న, బి. అర్చన ఎంపికయ్యారు. వీరు సెప్టెంబర్ రెండో వారంలో విజయనగరం జిల్లా బొబ్బిలిలో జరిగే రాష్ట్ర స్థాయి సబ్‌జూనియర్ పోటీల్లో పాల్గొంటారని పాఠశాల పీడీ జి. సునీల్ కుమార్ తెలిపారు.జూనియర్ విభాగంలో ఓ. శ్రీ చైతన్య,జె.జయకృష్ణ,కె.హేమంత్ దేవీ ప్రసాద్,కె.ఎల్.లోకేశ్వరి,వి.అలేఖ్య, కె.లక్ష్మీప్రణతి,వై.అను,డి.లీలా,ఎ.మోహన దుర్గా పావని రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు.వీరు అక్టోబర్ రెండో వారంలో కడప జిల్లా పుల్లంపేటలో జరిగే రాష్ట్ర స్థాయి సాఫ్ట్‌బాల్ టోర్నమెంట్‌లో పాల్గొంటారని పాఠశాల హెచ్ఎం ఎస్.ఎస్.బి. సుశీలమణి తెలిపారు. రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను పాఠశాల పేరెంట్స్ కమిటీ చైర్మన్ ముర్రే శివశంకర్,సొసైటీ చైర్మన్ అంగర కృష్ణ,శలపాక నీటి సంఘం అధ్యక్షుడు తాడి రామారెడ్డి (టీఎంఆర్), టీడీపీ సీనియర్ నాయకులు చంద్రు వీర్రాజు చౌదరి,తోట కృష్ణ,పలివెల రాజు, కోకా హరి,అంగర శ్రీను అభినందించారు. విద్యార్థులు క్రీడల్లో మరింత రాణించి పాఠశాలకు, గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. విద్యార్థుల ప్రతిభకు కృషి చేసిన పీడీలు ఇమ్మాన్యుయేల్ రాజు,గంగరాజు, ప్రసాద్,శ్రీనుబాబు తదితర ఉపాధ్యాయులను అభినందించారు.

## సహకార బ్యాంకు ఉద్యోగుల సమస్యల పరిష్కారమే లక్ష్యం

**డీసీసీ బ్యాంకును లాభాల్లో నడిపిస్తున్న చైర్మన్, సీఈఓలకు అభినందనలు**



**కాకినాడ, పెన్ పవర్,ఆగస్టు 23:** జిల్లా కేంద్ర సహకార బ్యాంకులో పనిచేస్తున్న ఉద్యోగుల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా తమ అసోసియేషన్ నిరంతరం పనిచేస్తుందని తూర్పుగోదావరి జిల్లా కేంద్ర సహకార ఉద్యోగుల సహకార సంఘం (ఏపీసీసీబీఈఏ) నాయకులు తెలిపారు. బ్యాంకును అభివృద్ధి పథంలో నడిపిస్తూ లాభాల్లోకి తీసుకెళ్లేందుకు అహర్నిశలు కృషి చేస్తున్న చైర్మన్, సీఈఓలకు వారు ధన్యవాదాలు తెలిపారు.ఆదివారం కాకినాడ శాంతి నివాస్ భవనంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఎం. క్రాంతి కృష్ణ,అధ్యక్షుడు పి.కృష్ణమోహన్, కార్యనిర్వాహక అధ్యక్షుడు జి.అప్పారావు,ట్రెజరర్ కే.పల్లవి మాట్లాడారు.రెండు రోజుల క్రితం 22 మందితో నూతన కమిటీని ఎన్నుకున్నట్లు వారు తెలిపారు. జిల్లాలోని 13 డీసీసీ బ్యాంకుల్లో 12 బ్యాంకులు వేతనాలు పెంచుకున్నప్పటికీ, తమ బ్యాంకు అప్పుల్లో ఉన్న పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని ఏరియర్స్‌ను వదులుకుని ఉద్యోగులకు వేతనాలు చెల్లించాలని అధికారులను కోరినట్లు చెప్పారు. బ్యాంకు అభివృద్ధి కోసం తమకు రావాల్సిన 41 నెలల ఏరియర్స్‌ను ప్రస్తుతం తీసుకోలేని పరిస్థితిని ఉద్యోగులు అంగీకరించారని తెలిపారు.

బ్యాంకుపైన, ఉద్యోగులపైన తమకు వ్యతిరేకంగా ఉన్న మరో అసోసియేషన్ తప్పుడు ప్రచారం చేస్తోందని, ఉద్యోగులు దానిని నమ్మవద్దని వారు కోరారు. బ్యాంకు నష్టాలకు ప్రధాన కారణాల్లో ఎన్పీఏలు ఉన్నాయని తాము గుర్తించినట్లు తెలిపారు. ఈ విషయాన్ని చైర్మన్ దృష్టికి తీసుకెళ్లగా, ఆయన తన పలుకుబడిని ఉపయోగించి ప్రభుత్వం నుంచి రావాల్సిన నిధులను సమీకరించి బ్యాంకు అప్పులను చాలా వరకు తగ్గించారని పేర్కొన్నారు.అదేవిధంగా రూ.18 కోట్ల టిడ్కో బకాయిలను కూడా చైర్మన్ చొరవతో చాలా వరకు తగ్గించగలిగామని వారు తెలిపారు. బ్యాంకు అభివృద్ధితో పాటు ఉద్యోగుల సంక్షేమం కోసం తమ అసోసియేషన్ ఎల్లప్పుడూ కృషి చేస్తుందని క్రాంతి కృష్ణ, కృష్ణమోహన్, అప్పారావు, పల్లవి స్పష్టం చేశారు.ఈ సమావేశంలో అసోసియేషన్ ఉపాధ్యక్షులు జి.బి.మనోహర్, ఐ.ఎస్.టి. ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## హరిత కాకినాడ కోసం ఆల్ ఈజ్ వెల్ సభ్యుల నిరంతర కృషి



**కాకినాడ, పెన్ పవర్,ఆగస్టు 23:** హరిత కాకినాడ లక్ష్యంగా ఆల్ ఈజ్ వెల్ సభ్యులు నిరంతరం పర్యావరణ పరిరక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా స్థానిక అక్షర స్కూల్ రోడ్డు వద్ద ఉన్న ఆల్ ఈజ్ వెల్ నర్సరీలో ఆదివారం మొక్కల సంరక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా ఆల్ ఈజ్ వెల్ కిషోర్ మాట్లాడుతూ.. కాకినాడ నగరాన్ని పచ్చదనంతో నింపేందుకు తమ సంస్థ ఆధ్వర్యంలో పట్టణవ్యాప్తంగా మొక్కలు నాటడం, పార్కుల అభివృద్ధి, పచ్చదనం పెంపుతో పాటు ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించే కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. కాకినాడ తీరప్రాంతం, మడ అడవుల పర్యావరణాన్ని పరిరక్షించేందుకు ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నామన్నారు. క్లీన్ అండ్ గ్రీన్ కాకినాడ కోసం నగరపాలక సంస్థ, స్వచ్ఛంద సంస్థలు, స్థానిక ప్రజల భాగస్వామ్యంతో మొక్కలు నాటే కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని చెప్పారు. పాఠశాలలు, కళాశాలలు, నివాస ప్రాంతాల్లో పర్యావరణ స్పృహ పెంచేలా ప్రచార కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు.ఆల్ ఈజ్ వెల్ సభ్యులు, దంత వైద్య నిపుణులు డా. అడ్డాల సత్యనారాయణ మాట్లాడుతూ.. గ్రీన్ కాకినాడ ప్రాజెక్టును మరింత ప్రభావవంతంగా అమలు చేసేందుకు అర్బన్ మైక్రో ఫారెస్ట్లు ఏర్పాటు చేయాలని సూచించారు. ఖాళీగా ఉన్న ప్రభుత్వ స్థలాలు, ఖాళీ ప్లాట్లలో మియావాకీ పద్ధతిలో తక్కువ స్థలంలో ఎక్కువ సంఖ్యలో చెట్లను వేగంగా పెంచే విధానాన్ని అమలు చేయవచ్చన్నారు.అలాగే కాకినాడ బీచ్, ప్రధాన వ్యాపార ప్రాంతాలను ప్లాస్టిక్ రహిత జోన్లుగా ప్రకటించి కఠినంగా అమలు చేయాల్సిన అవసరం ఉందన్నారు. నగరంలోని ప్రధాన భవనాలు, అపార్ట్‌మెంట్లలో రెయిన్ వాటర్ హార్వెస్టింగ్ గుంతలను తప్పనిసరి చేయాలని సూచించారు. పాఠశాలల్లో 'జెన్ గ్రీన్ క్లబ్స్' ఏర్పాటు చేసి విద్యార్థుల్లో మొక్కల పెంపకం, పర్యావరణ పరిరక్షణపై ఆసక్తిని పెంచుతున్నామని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఆల్ ఈజ్ వెల్ ఉపాధ్యక్షులు డా. రాజకుమార్, కార్యదర్శి టి.వి.వి.ఎస్.ఎన్. రెడ్డి, డా. రవివర్మ, విక్రమ్, రాజేంద్ర, శ్రీనివాసు, వెంకటనారాయణ, సీనియర్ సిటిజన్లు కరి నాగభూషణం, కృష్ణారావు, స్వామి తదితరులు పాల్గొన్నారు. సుమారు 30 మంది జెన్ గ్రీన్ విద్యార్థులు పాల్గొని మొక్కల సంరక్షణ కార్యక్రమంలో తమ సేవలను అందించారు.

## ప్రజా సమస్యల పరిష్కారానికి తొలిప్రాధాన్యత

**ప్రజా దర్బార్లో 34 అర్జీలు స్వీకరించిన మంత్రి వాసంశెట్టి సుభాష్**




**రామచంద్రపురం, పెన్ పవర్,ఆగస్టు 23:** ప్రజా సమస్యల పరిష్కారానికి తొలి ప్రాధాన్యత ఇస్తామని, ప్రజలకు అందుబాటులో ఉండే పాలన అందించడమే కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ అన్నారు. రామచంద్ర పురంలోని తన క్యాంపు కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన ప్రజా దర్బార్‌లో ప్రజల నుంచి నేరుగా వినతులు స్వీకరించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.నియోజకవర్గంలోని వివిధ గ్రామాలు, పట్టణ ప్రాంతాల నుంచి ప్రజలు పెద్ద సంఖ్యలో ప్రజా దర్బార్‌కు హాజరై తమ సమస్యలను మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా మొత్తం 34 అర్జీలు అందాయి. రేషన్ కార్డులు, సామాజిక భద్రత పింఛన్లు, ఇళ్ల స్థలాలు, రహదారుల నిర్మాణం, తాగునీటి సౌకర్యం, డ్రైనేజీ, విద్యుత్ సదుపాయాలు, సంక్షేమ పథకాల అమలు తదితర అంశాలపై ప్రజలు వినతిపత్రాలు సమర్పించారు.ప్రతి అర్జీని మంత్రి సుభాష్ స్వయంగా పరిశీలించి,సంబంధిత శాఖల అధికారులతో మాట్లాడారు.సమస్యల పరిష్కారానికి తగిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా ప్రభుత్వం ప్రజల వద్దకే చేరువవుతోందన్నారు.ప్రజల సమస్యలను వినడమే కాకుండా వాటి పరిష్కారానికి స్పష్టమైన కార్యాచరణతో ముందుకు సాగుతున్నామని మంత్రి తెలిపారు.ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు,ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం పారదర్శక, ప్రజాకేంద్రీకృత పాలన అందిస్తోందన్నారు.ప్రజా దర్బార్ వంటి కార్యక్రమాలు ప్రజలకు ప్రభుత్వంపై మరింత నమ్మకాన్ని పెంచుతున్నాయని, ప్రతి అర్జీపై నిరంతర పర్యవేక్షణ కొనసాగిస్తూ అర్హులైన వారికి న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. ప్రజల ఆశలు, ఆకాంక్షలకు అనుగుణంగా అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతూ సంక్షేమ ఫలాలను ప్రతి అర్హ కుటుంబానికి చేరవేయడమే ప్రభుత్వ ధ్యేయమన్నారు.ప్రజల సహకారంతో రామచంద్రపురం నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో మరింత అభివృద్ధి పథంలో నడిపించేందుకు కృషి చేస్తున్నామని మంత్రి పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో పట్టణ టీడీపీ అధ్యక్షుడు ఉండవల్లి శివ, రూరల్ మండల టీడీపీ అధ్యక్షుడు కొత్తపల్లి శ్రీనుబాబు, క్లస్టర్--2 ఇన్‌చార్జి కంచుమర్తి బాబురావు, కూటమి పార్టీల నాయకులు, కార్యకర్తలు, వివిధ గ్రామాల నుంచి వచ్చిన అర్జీదారులు పాల్గొన్నారు.

## అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటు హక్కు నమోదు చేసుకోవాలి.



**-ప్రత్తిపాడు తహసీల్దార్, ఎం సూర్యప్రభ.**

**కిర్లంపూడి/పెన్ పవర్, ఆగస్టు, 23:** అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటు హక్కు నమోదు చేసుకోవాలని ప్రత్తిపాడు తహసీల్దార్ ఎం సూర్యప్రభ పిలుపునిచ్చారు. ప్రత్తిపాడు మండలంలో నూతన ఓటర్ల నమోదుపై ఆదివారం పలు కేంద్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా బిఎల్‌ఓ లకు పలు సలహాలు సూచనలు అందజేశారు. ఈ సందర్భంగాతహసీల్దార్,ఎం సూర్యప్రభ మాట్లాడుతూ రానున్న ఎన్నికల దృష్ట్యా అర్హులైన ప్రతి ఒక్కరూ ఎన్నికల సంఘం ఇచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ఓటు హక్కు నమోదు చేసుకోవాలని పిలుపునిచ్చారు.

# కాకినాడ రూరల్‌లో టీడీపీ ఎన్నికల వ్యూహానికి శ్రీకారం





- కూటమి గెలుపే ధ్యేయం
- టీడీపీ రూరల్ ఇన్‌చార్జి పిల్లి అనంతలక్ష్మి

**కాకినాడ రూరల్ పెన్ పవర్ ఆగస్టు 23:** రానున్న ఎన్నికల్లో కాకినాడ రూరల్ నియోజకవర్గ పరిధిలోని కాకినాడ మున్సిపల్ కార్పొరేషన్ డివిజన్లలో కూటమి అభ్యర్థుల విజయమే లక్ష్యంగా తెలుగుదేశం పార్టీ ఎన్నికల కార్యాచరణకు శ్రీకారం చుట్టింది. బూత్ స్థాయి నుంచి పార్టీని మరింత బలోపేతం చేసి,ప్రతి ఓటరుతో మమేకమవుతూ కూటమి విజయానికి సమష్టిగా పనిచేయాలని కాకినాడ రూరల్ టీడీపీ ఇన్‌చార్జి,మాజీ ఎమ్మెల్యే పిల్లి అనంతలక్ష్మి పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు.వాకలపూడిలోని పిల్లి అనంతలక్ష్మి, సత్యనారాయణమూర్తి నివాసంలో 42, 47, 48, 49, 50, 1, 2, 3 డివిజన్లకు చెందిన ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించారు.రానున్న ఎన్నికలకు పార్టీ శ్రేణులను సమాయత్తం చేయడమే ప్రధాన అజెండాగా జరిగిన ఈ సమావేశంలో డివిజన్ల వారీగా పార్టీ పరిస్థితి,బూత్‌ల బలోపేతం,ఓటర్ల జాబితా పరిశీలన,ఓటర్ల వివరాల సేకరణ,బూత్ స్థాయి నాయకులు--కార్యకర్తల సమన్వయం తదితర అంశాలపై విస్తృతంగా చర్చించారు.ప్రతి బూత్‌లో టీడీపీ శ్రేణులు చురుకుగా పనిచేస్తూ ఓటర్ల జాబితాను క్షుణ్ణంగా పరిశీలించాలని, ఓటర్ల వివరాలను సేకరించి అవసరమైన సమాచారాన్ని సిద్ధంగా ఉంచుకోవాలని పిల్లి అనంతలక్ష్మి సూచించారు.ఎన్నికల నోటిఫికేషన్ ఎప్పుడు వెలువడినా ఎదుర్కొనే విధంగా నాయకులు, కార్యకర్తలు పూర్తి స్థాయిలో సిద్ధంగా ఉండాలని ఆమె స్పష్టం చేశారు.కూటమి తరపున రానున్న ఎన్నికల్లో ఎవరికి అభ్యర్థిత్వం లభించినా పార్టీ నిర్ణయానికి ప్రతి ఒక్కరూ కట్టుబడి పనిచేయాలని సమావేశంలో నిర్ణయించారు. అభ్యర్థి ఎవరైనా బూత్ స్థాయి నుంచి సమష్టిగా కృషి చేసి కూటమి అభ్యర్థిని గెలిపించడమే లక్ష్యంగా ముందుకు సాగాలని నాయకులకు దిశానిర్దేశం చేశారు.ఇదే సమయంలో కాకినాడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ఆరు డివిజన్లలో సుమారు రూ.3 కోట్లతో చేపట్టిన వివిధ అభివృద్ధి పనులను ఎన్నికల నోటిఫికేషన్ వెలువడకముందే పూర్తి చేయాలని సమావేశంలో చర్చించారు. ప్రజలకు అత్యవసరమైన రహదారులు, డ్రైనేజీ, ఇతర మౌలిక వసతుల పనులను ప్రాధాన్యత క్రమంలో వేగంగా పూర్తి చేయాలని సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లాలని నిర్ణయించారు.ప్రతి డివిజన్‌లో బూత్ కమిటీలను మరింత పటిష్టం చేసి, ఓటర్లతో నిరంతరం మమేకమవుతూ వారి సమస్యలను తెలుసుకుని పరిష్కారానికి కృషి చేయాలని పిల్లి అనంతలక్ష్మి పార్టీ నాయకులు, కార్యకర్తలకు సూచించారు. కూటమి ప్రభుత్వంపై ప్రజల్లో ఉన్న విశ్వాసాన్ని మరింత బలోపేతం చేస్తూ, రానున్న ఎన్నికల్లో కాకినాడ రూరల్ నియోజకవర్గంలో కూటమి అభ్యర్థుల విజయమే లక్ష్యంగా పనిచేయాలని ఆమె పిలుపునిచ్చారు.

## జాబ్ క్యాలెండర్ ను నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలి -ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ



**జగ్గంపేట, పెన్ పవర్, ఆగస్టు 23:** రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా రాష్ట్రవ్యాప్తంగా ఉన్న నిరుద్యోగులకు శుభవార్త అందించిందని, వివిధ శాఖల్లో 10,060 ఉద్యోగాల భర్తీకి ఆమోదముద్ర వేసిందని జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ అన్నారు. స్థానిక రావులమ్మ నగర్ లోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. ముఖ్యమంత్రి చంద్రబాబు జాబ్ క్యాలెండర్ విడుదల చేశారని పేజ్ -1 ఉత్తమ విద్యకు సంబంధించిన 1523 పోస్టులు, పేజ్ 2 సెప్టెంబర్ 15న గ్రూప్-1, పోలీస్ శాఖ, అటవీ శాఖ, అగ్నిమాపక శాఖ, జైళ్ల శాఖకు సంబంధించిన 3,231 పోస్టులు, పేజ్ 3 అక్టోబర్ 15న గ్రూప్-2 పోస్టులు, ఇరిగేషన్ శాఖ, ఎక్సైజ్ శాఖ, రోడ్డు రవాణా శాఖ సంబంధించిన 2,311 పోస్టులు, పేజ్ 4అక్టోబర్ 15న డీఎస్సీ 2995 పోస్టులు, మొత్తం నాలుగు విడతలలో 1,060 పోస్టుల భర్తీకి నోటీపికేషన్ విడుదలకు ప్రభుత్వం ఆమోదముద్ర వేసిందని తెలిపారు. ఇది రాష్ట్రంలోని నిరుద్యోగ యువతకు గొప్ప అవకాశమని, గత ప్రభుత్వంలో ఉద్యోగాల కోసం యువత ఎదురుచూసి నిరాశ చెందిందని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఇచ్చిన హామీ మేరకు జాబ్ క్యాలెండర్ ను ప్రకటించి నిరుద్యోగుల్లో భరోసా నింపిందన్నారు. జగ్గంపేట నియోజకవర్గంలోని నిరుద్యోగ యువత అంతా అప్రమత్తంగా ఉండి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. ప్రతి ఒక్కరూ ఇప్పటి నుండే ప్రణాళికాబద్ధంగా సన్నద్ధమై మన నియోజకవర్గం నుండి అత్యధిక ఉద్యోగాలు సాధించే దిశగా కృషి చేయాలని సూచించారు. యువతకు ఎలాంటి సహాయ సహకారాలు కావాలన్నా తాను అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర టిడిపి నాయకులు, మాజీ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎస్వీఎస్ అప్పలరాజు, మాజీ వైస్ ఎంపీపీ మారిశెట్టి భద్రం తదితరులు పాల్గొన్నారు.

## మేడిశెట్టి బాబీ ఆధ్వర్యంలో జనసేన కార్యాలయానికి శంకుస్థాపన...





- కత్తిపూడిలో ప్రత్తిపాడు నియోజకవర్గ పార్టీ కార్యాలయ నిర్మాణానికి శ్రీకారం....
- నియోజకవర్గంలో జనసేన బలోపేతానికి చర్యలు

**శంఖవరం పెన్ పవర్ ఆగస్టు 23:-** జనసేన అధినేత పవన్ కళ్యాణ్ ఆదేశాల మేరకు కత్తిపూడిలో జనసేన ప్రత్తిపాడు నియోజకవర్గ పార్టీ కార్యాలయ నిర్మాణానికి శంకుస్థాపన కార్యక్రమం నిర్వహించారు.జనసేన రాష్ట్ర సంయుక్త కార్యదర్శి, ప్రత్తిపాడు నియోజకవర్గ సమన్వయకర్త మేడిశెట్టి బాబీ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది.ఈ సందర్భంగా జిల్లా జనసేన సంయుక్త కార్యదర్శి దాసం శేషారావు మాట్లాడుతూ నియోజకవర్గంలో మేడిశెట్టి బాబీ ఆధ్వర్యంలో జనసేన పార్టీని మరింత బలోపేతం చేసేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. జనసైనికులు,పార్టీ నాయకులకు కార్యాలయం ఎల్లప్పుడూ అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. అలాగే జనసేన పార్టీని మరింత బలోపేతం చేసేందుకు మండలాల వారీగా పార్టీ కార్యాలయాలను ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో లింగంపర్తి సొసైటీ అధ్యక్షుడు పెంటకోట మోహన్,తుని జోన్ ఆత్మ కమిటీ వైస్ చైర్మన్ కరణం సుబ్రహ్మణ్యం,శంఖవరం మండల జనసేన అధ్యక్షుడు గాబు సుభాష్, ఉపాధ్యక్షుడు తలపంటి బుజ్జి,ఆత్మ కమిటీ సభ్యుడు మాగాపు వీరబాబు, ఏలేశ్వరం మండల జనసేన కార్యదర్శి గంగిరెడ్ల మణికంఠ,జనసేన నాయకులు తోకల కిరణ్, సైతిని సాయి, శీరం శ్రీను, ధర్మవరం నాని,పోసిన శ్రీను,కీర్తి కుమార్,పిల్లి దుర్గ,కండిపిల్లి ప్రవీణ్,కొయ్యా శ్రీను,గౌతు బుజ్జి,గాబు కృష్ణార్జున, గఫూర్ తదితరులు పాల్గొన్నారు.

# కరపత్రాలతో ఇంటింటా ప్రచారం.. కూటమి అభివృద్ధి వివరణ






**ప్రజల ముంగిటకు కూటమి అభివృద్ధి ప్రస్థానం**


**ఆత్రేయపురం పెన్ పవర్ ఆగస్టు 23:**కూటమి ప్రభుత్వం రెండేళ్ల పాలనలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లే కార్యక్రమంలో భాగంగా ఆత్రేయపురం మండలం ర్యాలి గ్రామ శివారు చిన్నం వారి కాలనీలో ఆదివారం సాయంత్రం ఇంటింటా ప్రచారం నిర్వహించారు. కూటమి ప్రభుత్వ పాలనలో అమలు చేస్తున్న వివిధ అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాలకు సంబంధించిన వివరాలను కరపత్రాల రూపంలో ప్రజలకు అందజేస్తూ వాటి ఉద్దేశాలను వివరించారు.ర్యాలి గ్రామ మాజీ సర్పంచ్ పేర్చెర్ల పుల్లంరాజు వర్మ ఆధ్వర్యంలో 60, 59, 57 బూత్ ఇన్‌చార్జిలతో కలిసి కార్యకర్తలు కాలనీలోని ప్రతి ఇంటికీ వెళ్లారు. ఈ సందర్భంగా కూటమి ప్రభుత్వం రెండేళ్ల కాలంలో చేపట్టిన అభివృద్ధి పనులు, ప్రజలకు అందిస్తున్న సంక్షేమ కార్యక్రమాలు, ప్రభుత్వ ప్రాధాన్యతలను ప్రజలకు వివరించారు. కరపత్రాలను అందజేసి అందులో పొందుపరిచిన అంశాలను ప్రజలకు వివరంగా తెలియజేశారు.

ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై ప్రజలకు అవగాహన కల్పించడమే ఇంటింటా ప్రచారం ప్రధాన ఉద్దేశమని నాయకులు తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు ప్రభుత్వ కార్యక్రమాల సమాచారం నేరుగా చేరేలా కార్యకర్తలు క్షేత్రస్థాయిలో విస్తృతంగా ప్రచారం నిర్వహిస్తున్నారని పేర్కొన్నారు. ప్రజల సమస్యలను తెలుసుకుంటూ, ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలపై వారి అభిప్రాయాలను కూడా సేకరించారు.ఈ సందర్భంగా బూత్ ఇన్‌చార్జ్ కందుల రాంబాబు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం రెండేళ్ల పాలనలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల వివరాలను ప్రజలకు తెలియజేయడం కోసం ఇంటింటా ప్రచారం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కరపత్రాల్లోని అంశాలను ప్రతి కుటుంబానికి వివరించి, ప్రభుత్వ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామని చెప్పారు.కార్యక్రమంలో బూత్ ఇన్‌చార్జిలు అత్తిలి వెంకట్, బొక్కా మునేంద్ర కుమార్, కఠారి నాగేశ్వరరావు, వేల్పూరి సత్తిబాబు, ఉలవల కృష్ణ, యార్లగడ్డ చిన్నబాబు తదితరులు పాల్గొన్నారు. కార్యకర్తలు కాలనీలోని పలు ప్రాంతాల్లో పర్యటిస్తూ కరపత్రాలను పంపిణీ చేసి, కూటమి ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించారు.




## తలుపులమ్మ అమ్మవారి దర్శనానికి పోటెత్తిన భక్తులు





**పెన్ పవర్ ప్రతినిధి (లోవ,) ఆగస్టు 23:** తుని మండలం లోవ శ్రీ తలుపులమ్మ దేవస్థానానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. ఆలయం తెరిచిన ఉదయం 5 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు సుమారు 14 వేల మంది భక్తులు శ్రీ తలుపులమ్మ అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.

భక్తుల రాకతో ఆలయ ప్రాంగణం సందడిగా మారింది. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన సౌకర్యాలను దేవస్థానం అధికారులు ఏర్పాటు చేశారు. భక్తులకు అందుతున్న సౌకర్యాలను దేవస్థానం కార్యనిర్వహణాధికారి విశ్వనాథ రాజు, ధర్మకర్తల మండలి అధ్యక్షుడు పీ. భాస్కర సత్యనారాయణ పర్యవేక్షించారు.

ఆదివారం ఒక్కరోజే దేవస్థానానికి వివిధ మార్గాల్లో గణనీయమైన ఆదాయం సమకూరింది. ప్రసాదాల విక్రయం ద్వారా రూ.1,95,855, పూజా టికెట్ల ద్వారా రూ.3,58,180, కేశఖండన టికెట్ల ద్వారా రూ.16,680, వాహన పూజలు, ఇతర సేవా టికెట్ల ద్వారా రూ.14,380, కాటేజీల ద్వారా రూ.89,300, ఇతర మిసెలేనియస్ డొనేషన్ల ద్వారా రూ.40,173, వేద ఆశీర్వచనం ద్వారా రూ.17,298 ఆదాయం వచ్చినట్లు ఈవో విశ్వనాథ రాజు తెలిపారు.

## పెరిగిన నిత్యావసర ధరలతో సామాన్యుడిపై పెనుభారం



**గండేపల్లి:** నిత్యావసర వస్తువుల ధరలు రోజురోజుకూ పెరుగుతుండటంతో సామాన్య ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర బూత్ కమిటీల విభాగం కార్యదర్శి మాలిరెడ్డి పాపారావు ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివారం సందర్భంగా ఆయన ఒక ప్రకటనలో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం సామాన్య మానవులకు అనేక సంక్షేమ పథకాలతో పాటు నిత్యవసర వస్తువుల ధరలను నియంత్రించి అందుబాటులో ఉంచుతామని చెబుతూ నమ్మ బలికింది తప్ప ఆచరణలో లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు . కానీ ఇప్పుడు సామాన్య మానవుడు జీవించే పరిస్థితి లేదని

ప్రస్తుతం కిలో పంచదార ధర రూ.65, వంట నూనె లీటర్ రూ.195, పెట్రోల్ లీటర్ రూ.117, కిలో బియ్యం ధర రూ.70కు చేరిందని ఆయన పేర్కొన్నారు. నిత్యావసర సరుకులు, ఇంధన ధరలు పెరగడంతో కుటుంబాలను పోషించుకోవడం సామాన్య, మధ్యతరగతి ప్రజలకు భారంగా మారిందన్నారు.

ఒకవైపు ఆదాయాలు ఆశించిన స్థాయిలో పెరగకపోగా, మరోవైపు నిత్యావసర వస్తువుల ధరలు పెరుగుతున్నాయని పాపారావు అన్నారు. ఇంటి అద్దె, విద్య, వైద్యం, విద్యుత్ తదితర ఖర్చులతో ఇప్పటికే ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న ప్రజలపై ధరల పెరుగుదల మరింత భారం మోపుతోందని తెలిపారు.

“పంచదార రూ.65, మంచినూనె రూ.195, పెట్రోల్ రూ.117, కిలో బియ్యం రూ.70కు చేరితే సామాన్యుడు ఎలా బతకాలి? నిత్యావసర ధరల పెరుగుదలతో సామాన్యుడు బ్రతికే పరిస్థితి లేకుండా పోతోంది” అని మాలిరెడ్డి పాపారావు ఆవేదన వ్యక్తం చేశారు.

ప్రభుత్వం నిత్యావసర ధరలను నియంత్రించి సామాన్య ప్రజలకు ఉపశమనం కల్పించే చర్యలు చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు.

# అన్నదాన పథకానికి రూ.1,00,116 విరాళం





**అన్నవరం: పెన్ పవర్ ఆగస్ట్ 23** ప్రముఖ పుణ్యక్షేత్రమైన అన్నవరం శ్రీ వీర వెంకట సత్యనారాయణ స్వామివారి దేవస్థానంలో నిర్వహిస్తున్న అన్నదాన పథకానికి విశాఖపట్నం వాస్తవ్యులు టీవీఆర్ లక్ష్మణరావు, శ్రీమతి సత్య అన్నపూర్ణ దంపతులు రూ. 1,00,116 విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా భక్తులకు అన్నదానం నిర్వహించేందుకు తమ వంతు సహకారంగా ఈ విరాళాన్ని సమర్పించినట్లు తెలిపారు. అన్నదాన పథకానికి విరాళం అందించిన దాతలకు దేవస్థానం అధికారులు కృతజ్ఞతలు తెలిపారు. స్వామివారి ఆశీస్సులు దాతల కుటుంబంపై ఎల్లప్పుడూ ఉండాలని ఆకాంక్షించారు

## 3 వేల మందికి ఒకేసారి అన్నదానం..

## వాడపల్లి క్షేత్రంలో వకుళామాత అన్నదాన భవనం





**ఆత్రేయపురం పెన్ పవర్ ఆగస్టు 23:**కోనసీమ తిరుమలగా ప్రసిద్ధిగాంచిన వాడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి క్షేత్రానికి నిత్యం భారీ సంఖ్యలో భక్తులు తరలివస్తుండటంతో వారికి మరింత మెరుగైన సౌకర్యాలు కల్పించే దిశగా అధికారులు చర్యలు చేపడుతోంది. ఇందులో భాగంగా భక్తులకు అన్నప్రసాదాన్ని సౌకర్యవంతంగా అందించేందుకు నిర్మిస్తున్న వకుళామాత అన్నదాన భవనం పనులను ఆలయ చైర్మన్ ముదునూరి వెంకటరాజు (గబ్బర్ సింగ్) ఆదివారం పరిశీలించారు.

ఒకేసారి సుమారు 3 వేల మంది భక్తులు భోజనం చేసే విధంగా నిర్మిస్తున్న ఈ అన్నదాన భవనం పనుల పురోగతిని చైర్మన్ పరిశీలించి సంబంధిత సిబ్బందికి పలు సూచనలు చేశారు. భక్తుల రద్దీకి అనుగుణంగా విశాలమైన భోజన వసతి కల్పించడంతో పాటు, అన్నప్రసాదం పంపిణీలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా నిర్మాణంలో అవసరమైన ఏర్పాట్లపై దృష్టి సారించాలని సూచించారు.


వాడపల్లి ఆలయానికి వివిధ ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివస్తుంటారని, ముఖ్యంగా శనివారాలు, ఉత్సవాలు, ప్రత్యేక పర్వదినాల్లో రద్దీ మరింత పెరుగుతుందని ఆలయ వర్గాలు పేర్కొంటున్నాయి. ఇప్పటికే ఆలయంలో నిత్య అన్నదానం కొనసాగుతుండగా, భక్తుల సంఖ్యకు అనుగుణంగా మరింత విస్తృతమైన వసతులు అవసరమవుతున్న నేపథ్యంలో ఈ భవనం నిర్మాణం ప్రాధాన్యత సంతరించుకుంది.

అన్నదాన భవనం నిర్మాణ పనులను ఆలయ చైర్మన్ ముదునూరి వెంకటరాజు ధర్మకర్తలు సలాది నాగేశ్వరరావు, తమ్మన సాయి ప్రసాద్, సిస్ట కుటుంబరావు కూడా పర్యవేక్షించారు. నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలను పాటిస్తూ పనులను వేగవంతంగా పూర్తి చేయాలని వారు సూచించారు.

భక్తులకు కేవలం దర్శన సౌకర్యాలే కాకుండా, విశ్రాంతి, అన్నప్రసాదం వంటి మౌలిక వసతులు కూడా సమర్థంగా అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటున్నట్లు ఆలయ వర్గాలు తెలిపాయి. వాడపల్లి క్షేత్రానికి భక్తుల రాక క్రమంగా పెరుగుతున్న నేపథ్యంలో 3 వేల మంది ఒకేసారి భోజనం చేసే సామర్థ్యంతో అన్నదాన భవనం అందుబాటులోకి వస్తే భక్తులకు ఎంతో ప్రయోజనం చేకూరనుంది. ఆలయ చైర్మన్ ముదునూరి వెంకటరాజు తెలిపారు

## కృష్ణవరంలో ఘనంగా గ్రామదేవతల విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవం.

-ముఖ్య అతిథులుగా హాజరైన ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ,జ్యోతుల మణమ్మ,జ్యోతుల నవీన్..





**కిర్లంపూడి,పెన్ పవర్, ఆగస్టు, 23**:కిర్లంపూడి మండలం కృష్ణవరం గ్రామంలో శ్రీ మంట్లమ్మతల్లి,శ్రీ మరిడమ్మతల్లి,శ్రీ మల్లమ్మతల్లి,నవగ్రహ విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవ కార్యక్రమాలు వైభవంగా నిర్వహించారు.గ్రామ టీడీపీ నాయకుడు బొదిరెడ్ల సుబ్బారావు ఆధ్వర్యంలో ఐదు రోజులుగా ఆలయం వద్ద ప్రత్యేక పూజలు,దేవతా హోమాలు,వివిధ ఆధ్యాత్మిక కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు.గ్రామదేవతల పండుగలను పురస్కరించుకుని ఆదివారం ఆలయం వద్ద భారీ అన్నసమారాధన నిర్వహించారు.సుమారు 6 వేల మందికి పైగా భక్తులకు మాంసాహర వంటకాలతో అన్నదానం చేశారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ,ఆయన సతీమణి జ్యోతుల మణమ్మ,కాకినాడ జిల్లా టీడీపీ అధ్యక్షులు జ్యోతుల నవీన్ హాజరై అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.అనంతరం అన్నసమారాధనలో పాల్గొన్నారు.విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవాన్ని పురస్కరించుకుని పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి అమ్మవార్లను దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.ఈ కార్యక్రమంలో మండల టీడీపీ నాయకులు కంచుమర్తి రాఘవ,తూము కుమార్,అనుకూల శ్రీకాంత్,పాఠంశెట్టి మురళీకృష్ణ,పాఠంశెట్టి రవి,బొజ్జపు శ్రీనివాస్,గోడె బాల,మూరా సత్తిబాబు, పలువురు టిడిపి నాయకులు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని అన్న ప్రసాదములు స్వీకరించారు.

## వాడపల్లి వెంకన్న సన్నిధిలో వైభవంగా పవిత్రోత్సవాలు

రెండవ రోజు శాస్త్రోక్తంగా ప్రత్యేక పూజలు -- స్వామివారికి పట్టు వస్త్రాల సమర్పణ






**ఆత్రేయపురం పెన్ పవర్ ఆగస్టు 23** :కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీదేవి భూదేవి సమేత శ్రీ వేంకటేశ్వరస్వామివారి పవిత్రోత్సవాలు అత్యంత భక్తిశ్రద్ధలతో వైభవంగా కొనసాగుతున్నాయి. శ్రావణ శుద్ధ ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని ఆదివారం నిర్వహించిన రెండవ రోజు ఉత్సవ కార్యక్రమాల్లో ఆలయ ప్రాంగణం ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది. వేద పండితుల మంత్రోచ్చారణలు, మంగళవాయిద్యాల నడుమ స్వామివారికి నిర్వహించిన విశేష పూజలు భక్తులను భక్తిపారవశ్యంలో ముంచెత్తాయి. వాడపల్లి ఆలయంలో పవిత్రోత్సవాలు మూడు రోజులపాటు నిర్వహించడం ఆనవాయితీగా కొనసాగుతోంది.

ఉదయం 9.15 గంటలకు ప్రారంభమైన పూజా కార్యక్రమంలో ఆలయ చైర్మన్ ముదునూరి వెంకటరాజు దంపతులు, ధర్మకర్త పెండెం కుమారి దంపతులు పాల్గొని స్వామివారికి భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు, వేద పండితుల ఆధ్వర్యంలో విప్రోష్చే పూజ, పుణ్యాహవచనం, పంచగవ్యారాధన--ప్రోక్షణ, పవిత్ర ప్రతిష్ఠ, ప్రధాన హోమములు, అష్టకలశారాధన, మహాస్నపనం, నీరాజనం, మంత్రపుష్పములు తదితర వైదిక కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు.

పవిత్రోత్సవాల్లో భాగంగా ఆలయ పవిత్రతను పునరుద్ధరించడం, వైదిక సంప్రదాయాల ప్రకారం ఆలయ పరిసరాలు, స్వామివారి సన్నిధిని శుద్ధీకరించడం వంటి కార్యక్రమాలకు ప్రత్యేక ప్రాధాన్యత ఉంటుంది. పవిత్రోత్సవాల్లో జరిగే హోమాలు, కలశారాధనలు, అభిషేకాలు, ప్రత్యేక పూజలు భక్తుల్లో ఆధ్యాత్మిక చైతన్యాన్ని పెంపొందిస్తాయని విశ్వాసం. వాడపల్లి క్షేత్రంలో ప్రతి ఏడాది పవిత్రోత్సవాలను వైఖానస ఆగమ శాస్త్రోక్త పద్ధతిలో నిర్వహిస్తున్నట్లు గతంలోనూ ఆలయ వర్గాలు వెల్లడించాయి.సాయంత్రం 5.30 గంటలకు రెండవ రోజు పవిత్రోత్సవాల్లో భాగంగా ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ చైర్మన్ ముదునూరి వెంకటరాజు దంపతులు, ధర్మకర్తలు స్వామివారికి పట్టు వస్త్రాలను సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం స్వస్తివాచనం, విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం, ప్రధాన హోమము, పవిత్రారోహణ, విశేషారాధన, నీరాజనం, మంత్రపుష్పములు వంటి కార్యక్రమాలను అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు.

పవిత్రారోహణ కార్యక్రమం సందర్భంగా ఆలయంలో ప్రత్యేక ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. వేద మంత్రాల ఘోష, మంగళవాయిద్యాల నడుమ నిర్వహించిన విశేషారాధన భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. పూజా కార్యక్రమాల్లో పాల్గొన్న భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలను స్వీకరించారు.

వాడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామివారిని భక్తులు 'ఏడు శనివారాల వెంకన్న'గా అత్యంత భక్తితో కొలుస్తారు. స్వామివారిని వరుసగా ఏడు శనివారాలు దర్శించుకుంటే కోరికలు నెరవేరుతాయనే విశ్వాసంతో రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు క్షేత్రానికి తరలివస్తుంటారు. ఈ నేపథ్యంలో పవిత్రోత్సవాలు జరుగుతున్న సమయంలో ఆలయానికి వచ్చే భక్తుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉండటంతో ఆలయ వర్గాలు ప్రత్యేక ఏర్పాట్లు చేపట్టాయి.ఉత్సవాల సందర్భంగా భక్తులకు దర్శనం, తీర్థప్రసాదాల పంపిణీలో ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఆలయ సిబ్బంది ఏర్పాట్లను పర్యవేక్షించారు. పవిత్రోత్సవాల వైదిక కార్యక్రమాలను భక్తులు ఆసక్తిగా తిలకిస్తూ స్వామివారి అనుగ్రహాన్ని పొందేందుకు ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు.రెండవ రోజు కార్యక్రమాలు ముగిసే సమయానికి ఆలయ ప్రాంగణం 'గోవింద నామస్మరణ'తో మార్మోగింది. స్వామివారి సన్నిధిలో నిర్వహించిన హోమాలు, విశేషారాధనలు, పవిత్రారోహణ కార్యక్రమాలతో భక్తుల్లో భక్తిభావం మరింత వెల్లివిరిసింది. పవిత్రోత్సవాల చివరి రోజు కూడా ప్రత్యేక పూజలు, వైదిక కార్యక్రమాలు నిర్వహించేందుకు ఆలయ అధికారులు, అర్చకులు ఏర్పాట్లు పూర్తి చేశారు.



## అన్నవరం సత్యదేవునికి వెండి శతగోపం సమర్పణ

**అన్నవరం: పెన్ పవర్ ఆగస్ట్ 23** ప్రముఖ పుణ్యక్షేత్రమైన అన్నవరం శ్రీ వీర వెంకట సత్యనారాయణ స్వామివారి దేవస్థానంలో భక్తిశ్రద్ధలతో వెండి శతగోపం సమర్పించారు.

నెల్లూరు వాస్తవ్యులు శ్రీ యజ్ఞమూర్తి హరికృష్ణ, శ్రీమతి కళ్యాణి దంపతులు శ్రీ సత్యదేవునిపై తమ భక్తిని చాటుకుంటూ 211 గ్రాముల వెండి శతగోపాన్ని స్వామివారికి సమర్పించారు. దీని విలువ సుమారు రూ. 62,000గా తెలిపారు.

ఈ సందర్భంగా దంపతులు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి, తమ మొక్కులు చెల్లించుకున్నారు. దేవస్థానం అధికారులు, అర్చకులు వారి భక్తిని అభినందించారు.

## ఘనంగా కుండ్రపు నాని నాయుడు జన్మదిన వేడుకలు...



**శంఖవరం పెన్ పవర్ ఆగష్టు 23:-** దళిత యువ ఉద్యమ నేత కుండ్రపు నాని నాయుడు జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా దళిత సంఘాల నాయకులు, యువత మరియు అభిమానులు నాని నాయుడుకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.



ఈ సందర్భంగా దళిత నాయకులు గునపర్తి అపురూప్, బత్తిన తాతాజీ, కానేటి వెంకటరమణ మాట్లాడుతూ, సామాజిక సమానత్వం, దళితుల హక్కులు, యువత సమస్యల పరిష్కారం కోసం నాని నాయుడు చేస్తున్న కృషిని ఈ సందర్భంగా కొనియాడారు. అణగారిన వర్గాల అభ్యున్నతికి నిరంతరం ముందుండి పోరాడుతూ, యువతలో చైతన్యం తీసుకురావడంలో ఆయన చేస్తున్న సేవలు అభినందనీయమని పేర్కొన్నారు.

దళిత సమాజం అభివృద్ధి, హక్కుల సాధన కోసం నాని నాయుడు మరింత ఉత్సాహంతో పనిచేయాలని ఆకాంక్షిస్తూ నాయకులు ఆయనకు హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

ఈ కార్యక్రమంలో పలువురు దళిత సంఘాల నాయకులు, యువకులు, అభిమానులు పాల్గొని నాని నాయుడుకు శుభాకాంక్షలు అందజేశారు.

## బి.ఎల్.ఓ లు అందుబాటులో ఉండి కొత్త ఓటరు దరఖాస్తులు స్వీకరించాలి.



**-నియోజకవర్గ ఎన్నికల అధికారి, ఏ శ్రీనివాసరావు.**

**కిర్లంపూడి/ప్రత్తిపాడు, పెన్ పవర్, ఆగస్టు 23:**ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమంలో భాగంగా బి. ఎల్. ఓ లు తమకు కేటాయించిన పోలింగ్ కేంద్రాల్లో అందుబాటులో ఉండి కొత్త ఓటర్ల నుండి దరఖాస్తులు స్వీకరించాలని ప్రత్తిపాడు నియోజకవర్గం ఎన్నికల అధికారి, బీసీ కార్పొరేషన్ కార్య నిర్వాహక అధికారి, ఎ శ్రీనివాసరావు బి ఎల్ ఓ లను ఆదేశించారు. ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమాన్ని పురస్కరించుకుని ఆదివారం ప్రత్తిపాడు గ్రామంలోని 96నుండి 105 పోలింగ్ కేంద్రాల వరకు సందర్శించి బి ఎల్ ఓ ల విధుల నిర్వహణను పరిశీలించారు. అదేవిధంగా సర్ ప్రక్రియలో భాగంగా బి ఎల్ ఓ లకు ఓటరు నమోదు ప్రక్రియపై పలు సలహాలు, సూచనలు అందజేశారు.

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at printed at SRI SAI GANGA PRINTERS AND PUBLISHERS FLAT NO: 504, Bharat Towers, 5th lane, Dwaraka Nagar, Visakhaptanam, Andhrapradesh-530016, and published at Flat No F2, Nihar towers, Srinagar, kakinada, kakinada District-533003
Editor: GANTYADA APPARAO. Mobile : 9059465965, RNI : APTEL/2017/73154 , editorpenpower@gmail.com

# 'స్థానికం'పై పట్టుబడతారా షర్మిలమ్మా.. ?

"ఎప్పుడు ఎన్నికలు వచ్చినా.. కాంగ్రెస్ పార్టీ పుంజుకుంటుంది. ప్రజలు ఈ పార్టీలతో(ప్రస్తుతం ఉన్నవి) విసిగిపోయారు."అని గత నెలలో సోషల్ మీడియా వేదికగా సుదీర్ఘ పోస్టు చేశారు కాంగ్రెస్ పార్టీ చీఫ్ వైఎస్ షర్మిల. ఆమె ఊహించినట్టుగానే ఇప్పుడు ఎన్నికలకు రంగం రెడీ అయింది. అది కూడా స్థానిక సంస్థల ఎన్నికలే కావడం గమనార్హం. అంటే.. భారీ విస్తర్ణం, లక్షల సంఖ్యలో జనాభా వంటివి ఉండరు. మునిసిపల్ వార్డుల్లో ఉండే.. 50 నుంచి 60 వేల మంది జనాభానే ఈ ఎన్నికల్లో ఓటేస్తారు. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ తరఫున ఆమెఏమేరకు పుంజుకుంటారు? ఏవిధంగా పార్టీని పరుగులు పెట్టి స్తారు? అనేది ఆసక్తిగా మారింది. ఎందుకంటే.. గత ఎన్నికలలో షర్మిలపై పార్టీ భారీగానే ఆశలు పెట్టుకుం ది. వైఎస్ రాజశేఖరరెడ్డి కుమార్తెగా ఆయన తాలూకు ఇమేజ్‌ను అందిపుచ్చుకుని పార్టీని బలోపేతం చేస్తారని.. పోయిన ఇమేజ్‌ను తీసుకువస్తారని పార్టీ భావించింది. కానీ, గత ఎన్నికల్లో ఒక్క చోట కూడా ఆశించిన మేరకు ఓట్లు రాలేదు.

అయితే.. 1 పర్సంట్ నుంచి 1.27 పర్సంట్‌కు ఓటు బ్యాంకును ముందుకు తీసుకువెళ్లడంలో షర్మిల జోరు పనిచేసింది. ఇక, ఆ తర్వాత.. కొన్నాళ్లు ప్రజల మధ్య ఉన్నారు. ఒకటి రెండు అంశాలకు సంబంధిం చి ప్రజల మధ్యకు కూడా వచ్చారు. కానీ, తనకు రాజ్యసభ సీటు విషయంలో పార్టీ ఇస్తానని చెప్పి.. ఇవ్వ కుండా ఉండడంతో అలిగిన షర్మిల ఆ తర్వాత ఏపీ ముఖం చూడలేదు. ఇది జరిగి మూడు మాసాలైంది. అయినా.. కేవలం ఎక్స్ వేదికగా మాత్రం కొంతమేరకు స్పందిస్తున్నారు. ఇక, ఇప్పుడు ఆమె కోరుకుంటున్నట్టుగా ఎన్నికలు వచ్చాయి. మొత్తం 123 మునిసిపాలిటీలకు గాను 100 చోట్ల అక్టోబరులోగా ఎన్నికలు జరగనున్నాయి. ఇవి కూడా బ్యాలెట్ విధానంలోనే జరపాలని ప్రభుత్వం నిర్ణయించింది. సో.. ఈ నేపథ్యాన్ని షర్మిల ఏమేరకు వినియోగించుకుంటారన్నది ప్రశ్న. మరోవైపు.. ఈ ఎన్నికలకు సంబంధించి ప్రధాన పార్టీలు అడుగులు వడివడిగా వేస్తున్నాయి. కానీ.. షర్మిల మాత్రం ఇంకా స్పందించలేదు. మరి పోటీ చేస్తారా? చేయరా? అసలు వ్యూహం ఏంటి? ఎలా ముందుకు వెళ్తారు? అనే విషయాలపై క్లారిటీ కోరుతూ.. తాజాగా కాంగ్రెస్ కార్యకర్తలు.. ఆమెను ఉద్దేశించి వ్యాఖ్యలు చేస్తుండడం గమనార్హం.

03
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
కోర్టు పబ్లికేషన్ యాడ్స్
కేవలం
యాడ్ 500/-
'పో. 12 సెం.మీ, వె. 8 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

## వైసీపీ వెనక్కు వస్తుందా ?!



'మా దృష్టి పూర్తిగా 2019 ఆంధ్రప్రదేశ్ ఎన్నికల మీదనే ఉంది. గత నాలుగున్నర సంవత్సరాలలో తెలంగాణలో జరిగిన పరిణామాలను పరిగణనలోకి తాము ఈ నిర్ణయం తీసుకున్నామని' వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్మోహన్ రెడ్డి 2018 నవంబర్ 10న పార్టీ సెంట్రల్ కమిటీ ద్వారా నిర్ణయాన్ని ప్రకటించాడు. 2014 ఎన్నికల్లో తెలంగాణలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ పోటీ చేసి ఖమ్మం జిల్లాలో ఒక ఎంపీ, మూడు ఎమ్మెల్యే స్థానాలను గెలుచుకుంది. ఖమ్మం ఎంపీగా పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, వైరా ఎమ్మెల్యేగా బానోతు మదన్ లాల్, పినపాక ఎమ్మెల్యేగా పాయం వెంకటేశ్వర్లు, అశ్వారావు పేట ఎమ్మెల్యేగా తాతా వెంకటేశ్వర్లు గెలుపొందారు. ఆ తదనంతర పరిణామాల నేపథ్యంలో గెలిచిన ఎంపీ, ఎమ్మెల్యేలు బీఆర్ఎస్ పార్టీలో చేరారు. అందుకే తాము పూర్తిగా ఆంధ్రప్రదేశ్ రాజకీయాల మీదనే ఫోకస్ పెట్టినట్లు తెలిపారు. అయితే తెలంగాణలో జరుగుతున్న తాజా రాజకీయ పరిణామాల నేపథ్యంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ తిరిగి తెలంగాణలో పోటీ చేయబోతుందన్న ఊహాగానాలు వినిపిస్తున్నాయి. మంత్రి కొండా సురేఖ కూతురు కొండా సుష్మిత సీఎం రేవంత్ రెడ్డి మీద చేసిన ఆరోపణలు, కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి సొంత కాంగ్రెస్ ప్రభుత్వం మీద చేస్తున్న విమర్శల వెనక వైసీపీ ఉందని, వైఎస్ భారతిని తెలంగాణ అధ్యక్షురాలిగా నియమించి 2028 ఎన్నికల్లో పోటీ చేస్తారని అంటున్నారు. తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డికి ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుతో ఉన్న అనుబంధం అందరికీ తెలిసిందే. ఇక తెలంగాణ మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, ఏపీ మాజీ ముఖ్యమంత్రి వైటఎస్ జగన్మోహన్ రెడ్డిల మధ్య ఉన్న సంబంధాలు కూడా అందరికీ తెలిసినవే. తాజగా రేవంత్ ప్రభుత్వం మీద వస్తున్న ఆరోపణల వెనక బీఆర్ఎస్, వైసీపీ ఉన్నాయని ప్రచారం చేయడం ద్వారా తెలంగాణలో ఉన్న ఆంధ్రులు, ఎన్టీఆర్, టీడీపీ అభిమానులను రేవంత్ వైపు మరల్చేందుకు ఈ చర్చను ముందుకు తీసుకువచ్చారని అంటున్నారు.

2024 ఎన్నికల్లో ఏపీలో వైసీపీ 11 శాసనసభ స్థానాలకు పరిమితం అయింది. 58 సభ్యులు ఉన్న శాసనమండలిలో వైసీపీ సభ్యుల సంఖ్య 42. 2024 ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత బల్లి కళ్యాణ్ చక్రవర్తి, కర్రి పద్మశ్రీ, మర్రి రాజశేఖర్, జయమంగళ వెంకటరమణ తదితరులు చంద్రబాబు సమక్షంలో టీడీపీలో చేరారు. వీరి అనర్హత అంశం మండలి చైర్మన్ వద్ద పెండింగ్ లో ఉంది. వైసీపీ మనుగడ కొనసాగాలంటే 2029 ఎన్నికల్లో ఏపీలో ఖచ్చితంగా అధికారంలోకి రావాల్సిన అవశ్యత ఉంది. ఈ నేపథ్యంలో ఆ పార్టీ తెలంగాణ రాజకీయాల వైపు అడుగుపెట్టే అవకాశం ఎంత మాత్రం లేదనే చెప్పాలి. మరి ఈ ఊహాగానాలపై ఆ పార్టీ అధిష్టానం ఎలా స్పందించాలో వేచిచూడాలి.

## కోట్ల తర్వాత.. ఛాన్స్ కోసం శబరి ప్రయత్నం..!

కేంద్ర కేబినెట్‌లో మార్పులు చేర్పులకు పావులు కదుపుతున్న సమయంలో అనూహ్యంగా నంద్యాల ఎంపీ బైరెడ్డి శబరి తన రాజకీయాలను ముమ్మరం చేశారు. మంత్రివర్గంలో చోటు కోసం.. రెండు రూపాల్లో ఆమె ప్రయత్నం చేస్తున్నట్టు రాజకీయ వర్గాల్లోనూ.. టీడీపీలోనూ చర్చ సాగుతోంది. ఇవి వర్కవుట్ అయితే.. శబరి కేంద్ర మంత్రి లేదా సహాయ మంత్రి అయ్యే అవకాశం పుష్కలంగా ఉందని చెబుతున్నారు. పార్టీ పరంగా కూడా..ఇది కలిసి వస్తుందన్న అంచనాలు ఉన్నాయి. 1) రెడ్డి కోటా: రెడ్డి కోటాలో .. దాదాపు 20 ఏళ్ల కిందట సీమ నుంచి ఒకరు కేంద్ర మంత్రి అయ్యారు. కోట్ల సూ ర్యప్రకాశ్ రెడ్డి కాంగ్రెస్ హయాంలో మంత్రిగా చక్రం తిప్పారు. ఆ తర్వాత.. ఇప్పటి వరకు సీమకు మంత్రి పదవి దక్కలేదు. ఇప్పుడు అదే రెడ్డి కోటాలో శబరి ప్రయత్నం చేస్తున్నారు. ఇది రాజకీయంగా కూడా టీడీపీకి వ్యూహాత్మక ఎత్తుగడ కానుంది. రెడ్డి వర్గాన్ని వైసీపీకి దూరం చేసే క్రమంలో శబరికి కేంద్ర మంత్రివర్గంలోపోస్టు ఇస్తే.. ఎలా ఉంటుందన్న చర్చ జరుగుతోంది. 2) మహిళా కోటా: ముఖ్యంగా మహిళలకు కేంద్రం కూడా ప్రాధాన్యం ఇవ్వాలని నిర్ణయించింది. 2029 సార్వత్రిక ఎన్నికల సమరం నాటికి ఈ ప్రభావం ఎక్కువగా ఉండనుంది. 33 శాతం మహిళలకు అవకాశం ఇచ్చే ఉద్దేశం తమకు ఉందని ప్రధాని కూడా చెబుతున్నారు. ఈ నేపథ్యంలో ముందుగానే దీనిని చేసి చూపిస్తే.. తమకు మరిన్ని మంచి మార్కులు పడనున్నాయి. అయితే.. ఎక్కడినుంచైనా మహిళలకు అవకాశం ఇవ్వొచ్చు. అది ఏపీ నుంచే ఎందుకు? అనే ప్రశ్న వస్తుంది. ఏపీపై ఎక్కువగా బీజేపీ ఆశలు పెట్టుకున్న దరిమిలా.. ఆ అవకాశం ఏపీకే దక్కనుందని అంటున్నారు. ఈ క్రమంలోనే శబరి కూడా తన ప్రయత్నాలు ముమ్మరం చేశారు. మహిళా ఎంపీగా ఫైర్ బ్రాండ్ నాయకురా లిగా హిందీ సహా ఇంగ్లీష్, తెలుగులోనూ ఆమెకు భాషాప్రావీణ్యం ఉన్న నేపథ్యంలో కేంద్రంలో మంత్రి పీటం కోసం ప్రయత్నం చేస్తున్నారు. అటు మోడీ దగ్గర, ఇటు చంద్రబాబు దగ్గర కూడా ఆమెకు మంచి మార్కులే ఉన్నాయి. ఈ నేపథ్యంలో ఏ చిన్న అవకాశం ఆమెకు లభించినా.. మంత్రి అయిపోవడం ఖాయమని తెలుస్తోంది. ఇదే జరిగితే.. కోట్ల తర్వాత శబరి ఈ అవకాశం దక్కించుకున్నట్టు అవుతుంది.

## బీజేపీ రాజుగారిని కాస్త పట్టించుకోవాలట... !



బీజేపీ సీనియర్ నాయకుడు, విశాఖ ఉత్తర నియోజకవర్గం ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు గురించి అందరికీ తెలిసిందే. ఆయన ఉన్నది ఉన్నట్టు మాట్లాడేస్తారు. సొంత పార్టీ పైనా ఆయనకు అదే విధానం కొనసాగు తోంది. ఇదే ఇప్పుడు ఎప్పుడూ.. ఆయనకు ఇబ్బందిగా మారింది. కానీ, ఆయన ఈవిషయం గుర్తించారో లేదో తెలియదు కానీ.. పార్టీ మాత్రం ఆయనను గుర్తించాలని కోరుకుంటున్నారు. మరి ఇంతకీ ఏం జరిగింది? అనేది కదా.. సందేహం. బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబిన్ ఇటీవల విశాఖపట్నానికి వచ్చారు. రెండు రోజులు ఇక్కడే ఉన్నారు. ఇది పూర్తిగా పార్టీ కార్యక్రమం. భవిష్యత్తు వ్యూహాలు.. కూటమితో ఎలా కలివిడిగా ఉండాలి. పార్టీని ఎలా ముందుకు తీసుకువెళ్లాలి.. అనే అంశాలపై ఆయన పార్టీ నాయకులకు దిశానిర్దేశం చేశారు. కట్ చేస్తే.. జాతీయ అధ్యక్షుడు వచ్చినప్పుడు సమన్వయం కోసం కమిటీని ఏర్పాటు చేశారు. దీనిలో విష్ణకుమార్ పేరు లేదు. ఇదే ఆయనకు ఆవేదన కలిగించింది. దీంతో పార్టీలో తనను పట్టించుకోవడం లేదంటూ.. పరోక్షంగా వ్యాఖ్యలు చేశారు. --పార్టీలో సీనియర్లు.. సీనియర్లు అంటారు కానీ.. వాళ్లకి వాల్యూ లేదండీ. మా మాట ఎవరు వింటారు. మా పార్టీలో మొదట నుంచి ఇలానే ఉంది.-- అని ఓ మీడియాతో వ్యాఖ్యానించారు. అయితే..

పార్టీ పరంగా ఆయనకు ఏమీ తక్కువ చేయలేదని పార్టీ కీలక నాయకులు చెబుతున్నారు. పూర్తిగా పార్టీ కార్యక్రమం అవడంతోపాటు యువ నాయకులకు ప్రాధాన్యం ఇవ్వాలని పార్టీ అధిష్టానం ఆదేశించిందని అందుకే కొందరి పేర్లను కమిటీలో చేర్చలేదని పేర్కొన్నారు.కట్ చేస్తే.. విష్ణుకుమార్ రాజు వ్యవహారం ఆది నుంచి అసంతృప్తితోనే ముందుకు సాగుతోంది. తనకు ఆశించిన మేరకు గుర్తింపురాలేదన్నది ఆయన ఆవేదన. అంతేకాదు.. సిఫారసులకు పార్టీలో ప్రాధాన్యం ఉందని కూడా గతంలోనే వ్యాఖ్యానించారు. ఇంతకీ ఆయన ఆశిస్తున్నది మంత్రిపదవన్న విషయం తెలిసిందే. కానీ, ఈ విషయంలో ఆయన కోరుకున్నట్టు జరగడం లేదు. అందుకే ఈ అసంతృప్తి అన్నది పార్టీ నేతలకు కూడా తెలిసిందే. మరి ఏది ఏమైనా సీనియర్ ఎమ్మెల్యేగా విష్ణ కుమార్‌ను పట్టించుకుంటారో.. లేక యూత్ జాబితాలో దూరం పెడతారో చూడాలి.

## పవన్ కళ్యాణ్ కేరళ ట్రిప్.. ఆయుర్వేద ట్రీట్‌మెంట్ కోసం ప్రత్యేక పర్యటన!





ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ కుడి భుజానికి ఇటీవల శస్త్రచికిత్స జరిగిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో తదుపరి వైద్య చికిత్స, ఉపశమనం కోసం ఆయన కేరళ రాష్ట్రానికి వెళ్లారు. శనివారం సాయంత్రం కొచ్చి విమానాశ్రయానికి చేరుకున్న ఆయన, అక్కడి నుంచి నేరుగా త్రిస్సూర్ సమీపంలోని ఓ ప్రసిద్ధ ఆయుర్వేద వైద్యశాలకు చేరుకున్నారు. ఈ పర్యటనకు సంబంధించిన విషయాన్ని పవన్ కల్యాణ్ స్వయంగా తన సోషల్ మీడియా ఖాతా 'ఎక్స్' (ట్విట్టర్) ద్వారా పంచుకున్నారు. ఆ వివరాలు చూద్దాం..

**భుజం నొప్పి నివారణకు ప్రత్యేక ఆయుర్వేద థెరపీ:**

ఇటీవల జరిగిన శస్త్రచికిత్స నుంచి త్వరగా కోలుకోవడానికి, భుజం నొప్పుల నుంచి ఉపశమనం పొందడానికి పవన్ కల్యాణ్ ఈ ఆయుర్వేద ఆసుపత్రిలో ప్రత్యేక థెరపీ చికిత్స తీసుకోనున్నారు. ఆయుర్వేద వైద్య నిపుణుల సమక్షంలో కొన్ని రోజుల పాటు ఈ ఫిజియోథెరపీ మరియు ఆయుర్వేద చికిత్సలు కొనసాగనున్నాయి. ఇక ఈ శస్త్రచికిత్స అనంతర సంరక్షణ పూర్తిస్థాయిలో జరగడానికి ఈ ట్రీట్‌మెంట్ ఎంతో దోహదపడుతుందని వైద్యులు చెబుతున్నారు.

**చికిత్స పూర్తయ్యాక మళ్లీ విధుల్లోకి:**

రాజకీయాలు, పాలనా వ్యవహారాలతో నిరంతరం బిజీగా ఉండే పవన్ కల్యాణ్, కొద్దిరోజుల పాటు కేరళలోని ఈ ఆయుర్వేద కేంద్రంలోనే ఉండి చికిత్స తీసుకోనున్నారు. ఇక వైద్యుల సలహా మేరకు ఈ ట్రీట్‌మెంట్ పూర్తయిన తర్వాత ఆయన తిరిగి అమరావతికి చేరుకుంటారు. ఆ తర్వాత యథావిధిగా తన ప్రభుత్వ అధికారిక కార్యక్రమాలు, శాఖాపరమైన సమీక్షల్లో పాల్గొననున్నట్లు తెలుస్తోంది.

**అభిమానుల ఆందోళన.. త్వరగా కోలుకోవాలని ప్రార్థనలు:**

జనసేనాని, ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఆయుర్వేద చికిత్స కోసం కేరళ వెళ్లారనే వార్త తెలియగానే ఆయన అభిమానులు, జనసేన శ్రేణులు కాస్త ఆందోళనకు గురయ్యాయి. అయితే ఇది కేవలం శస్త్రచికిత్స తదుపరి సాధారణ ఆయుర్వేద థెరపీ మాత్రమేనని తెలవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. ఆయన త్వరగా పూర్తి ఆరోగ్యాన్ని పుంజుకుని, మళ్లీ ప్రజాక్షేత్రంలోకి రావాలని కోరుకుంటూ సోషల్ మీడియా వేదికగా మెసేజ్‌లు పోస్ట్ చేస్తున్నారు.

పవన్ కల్యాణ్ ఆరోగ్యం త్వరగా కుదుటపడాలని ఆయన అభిమానులు, నాయకులు ఆకాంక్షిస్తున్నారు. కేరళలో అందిస్తున్న ఈ ప్రత్యేక ఆయుర్వేద చికిత్సతో ఆయన భుజం నొప్పి నుంచి పూర్తిగా ఉపశమనం పొంది, త్వరితగతిన కోలుకుని మళ్లీ ప్రజా సేవలో చురుగ్గా పాల్గొనాలని అందరూ కోరుకుంటున్నారు!

# శ్రీలంకపై పడిక్కల్ హవా.. వరుసగా రెండో టెస్టులోనూ సెంచరీ

- శ్రీలంకతో రెండో టెస్టులోనూ సెంచరీ చేసిన దేవదత్ పడిక్కల్
- 73 ఓవర్లలో భారత్ స్కోరు 271/3
- అర్ధశతకంతో రాణించిన కెప్టెన్ శుభ్‌మన్ గిల్
- జడేజాతో కలిసి కీలక భాగస్వామ్యం నెలకొల్పిన పడిక్కల్
- తొలి టెస్టులోనూ 167 పరుగులతో భారీ సెంచరీ చేసిన పడిక్కల్



**హైదరాబాద్ పెన్ పవర్:** శ్రీలంకతో జరుగుతున్న టెస్టు సిరీస్‌లో భారత యువ బ్యాటర్ దేవదత్ పడిక్కల్ తన అద్భుతమైన ఫామ్‌ను కొనసాగిస్తున్నాడు. తొలి టెస్టు మొదటి ఇన్నింగ్స్‌లో 167 పరుగుల భారీ శతకంతో ఆకట్టుకున్న పడిక్కల్, కొలంబో వేదికగా జరుగుతున్న రెండో టెస్టులోనూ సెంచరీతో కదం తొక్కాడు. అతని అద్భుత ఇన్నింగ్స్ సాయంతో, తొలి రోజు ఆట ముగిసే సమయానికి భారత జట్టు పటిష్ఠ స్థితిలో నిలిచింది.కొలంబోలోని సింహళీస్ స్పోర్ట్స్ క్లబ్ మైదానంలో నేడు ప్రారంభమైన ఈ మ్యాచ్‌లో టాస్ గెలిచిన భారత కెప్టెన్ శుభ్‌మన్ గిల్ బ్యాటింగ్ ఎంచుకున్నాడు. ఓపెనర్లుగా బరిలోకి దిగిన యశస్వి జైస్వాల్ (45), కేఎల్ రాహుల్ (18) మోస్తరు స్కోర్లు సాధించారు. జైస్వాల్ దూకుడుగా ఆడినా, భారీ స్కోరు చేయలేకపోయాడు. రాహుల్ మరోసారి నిరాశపరిచాడు. కేవలం 66 పరుగులకే రెండు వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడిన జట్టును పడిక్కల్ ఆదుకున్నాడు.కెప్టెన్ శుభ్‌మన్ గిల్‌తో కలిసి పడిక్కల్ కీలకమైన భాగస్వామ్యాన్ని నెలకొల్పాడు. వీరిద్దరూ మూడో వికెట్‌కు 120 పరుగులు జోడించారు. ఈ క్రమంలో గిల్ (50) బాధ్యతాయుతమైన అర్ధశతకం పూర్తి చేసుకోగా, పడిక్కల్ తన క్లాస్ బ్యాటింగ్‌తో అలరించాడు. గిల్ ఔటైన తర్వాత క్రీజులోకి వచ్చిన రిషభ్ పంత్ (3) గాయం కారణంగా రిటైర్డ్ హర్ట్‌గా వెనుదిరిగాడు. అనంతరం రవీంద్ర జడేజాతో కలిసి పడిక్కల్ ఇన్నింగ్స్‌ను ముందుకు నడిపించాడు.

ప్రస్తుతం పడిక్కల్ 185 బంతుల్లో 12 ఫోర్లతో 111 పరుగులు, జడేజా 45 బంతుల్లో 31 పరుగులతో క్రీజులో ఉన్నారు. వీరిద్దరూ అప్పటికే అజేయంగా 64 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పారు. భారత్ 73 ఓవర్లలో 3 వికెట్ల నష్టానికి 271 పరుగులు చేసి భారీ స్కోరు దిశగా పయనిస్తోంది. శ్రీలంక బౌలర్లలో అసిత్ ఫెర్నాండో రెండు వికెట్లు తీయగా, లహిరు కుమార ఒక వికెట్ పడగొట్టాడు.

# భారత్-శ్రీలంక టెస్టులో ఉద్రిక్తత.. బౌలర్‌పైకి దూసుకెళ్లిన యశస్వి జైస్వాల్

- భారత్-శ్రీలంక రెండో టెస్టులో చోటుచేసుకున్న ఘటన
- ఔటయ్యాక బౌలర్ ఫెర్నాండోతో జైస్వాల్ తీవ్ర వాగ్వాదం
- ఒకరినొకరు ఎదుర్కొని తలలతో ఢీకొన్నంత పనిచేసిన ఆటగాళ్లు
- వికెట్‌కు ముందు ఫెర్నాండో బౌలింగ్‌లో జైస్వాల్ హ్యాట్రిక్ ఫోర్లు




**హైదరాబాద్ పెన్ పవర్:** కొలంబో వేదికగా భారత్, శ్రీలంక జట్ల మధ్య జరుగుతున్న సిరీస్‌లోని చివరి టెస్టు మ్యాచ్‌లో ఉద్రిక్తత చోటుచేసుకుంది. టీమిండియా యువ ఓపెనర్ యశస్వి జైస్వాల్, లంక పేసర్ అసిత ఫెర్నాండో మధ్య మైదానంలో తీవ్ర వాగ్వాదం జరిగింది. ఆదివారం మ్యాచ్ తొలి రోజు లంచ్ విరామానికి కొద్దిసేపటి ముందు ఈ ఘటన చోటుచేసుకుంది.టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న భారత్ ఇన్నింగ్స్ 17వ ఓవర్ చివరి బంతికి, ఫెర్నాండో అద్భుతమైన డెలివరీతో జైస్వాల్‌ను బౌల్డ్ చేశాడు. అయితే, వికెట్ పడిన వెంటనే మైదానంలో అనూహ్య పరిణామాలు చోటుచేసుకున్నాయి. శ్రీలంక ఆటగాళ్లు సంబరాలు చేసుకుంటుండగా, యశస్వి డగౌట్ వైపు వెళుతున్న క్రమంలో అసిత ఫెర్నాండో కొన్ని వ్యాఖ్యలు చేశాడు. దీంతో జైస్వాల్ ఒక్కసారిగా వెనక్కి తిరిగి అతడిని నిలదీశాడు.ఆగ్రహానికి గురైన జైస్వాల్, బౌలర్ ఫెర్నాండో వైపు దూసుకెళ్లి వాగ్వాదానికి దిగాడు. ఇద్దరి మధ్య మాటల యుద్ధం ముదరడం, ఒకరికొకరు అత్యంత సమీపంలోకి రావడంతో మైదానంలో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. ఈ గొడవకు ముందు, ఫెర్నాండో బౌలింగ్‌లోనే జైస్వాల్ వరుసగా మూడు బంతుల్లో మూడు బౌండరీలు బాదాడు. ఆ తర్వాత బంతికే యశస్వి అవుట్ కావడంతో ఫెర్నాండో దూకుడుగా సంబరాలు చేసుకోవడం, లంక ఆటగాళ్ల వ్యాఖ్యలు జైస్వాల్ ప్రతిస్పందనకు కారణమయ్యాయి. ఈ ఇన్నింగ్స్‌లో యశస్వి జైస్వాల్ 53 బంతులు ఎదుర్కొని 9 ఫోర్ల సాయంతో 45 పరుగులు చేసి వెనుదిరిగాడు.

# బంగ్లాదేశ్ సరికొత్త చరిత్ర.. ఐసీసీ ర్యాంకింగ్స్‌లో తొలిసారిగా టాప్-6



**హైదరాబాద్ పెన్ పవర్:** బంగ్లాదేశ్ క్రికెట్ జట్టు టెస్ట్ ఫార్మాట్‌లో సరికొత్త చరిత్రను లిఖించింది. ఐసీసీ ఆదివారం విడుదల చేసిన తాజా టెస్ట్ ర్యాంకింగ్స్‌లో మూడు స్థానాలు ఎగబాకి ఆరో ర్యాంకును కైవసం చేసుకుంది. టెస్ట్ క్రికెట్ చరిత్రలో బంగ్లాదేశ్ జట్టు తొమ్మిదో స్థానాన్ని దాటి పైకి రావడం ఇదే ప్రప్రథమం కావడం విశేషం. ఇటీవల ఆస్ట్రేలియా పర్యటనలో చారిత్రక ప్రదర్శన కనబరచడమే ఈ ఘనతకు కారణమైంది.ఇటీవల ఆస్ట్రేలియా గడ్డపై జరిగిన రెండు టెస్టుల సిరీస్‌ను బంగ్లాదేశ్ 1-1తో సమం చేసింది. తొలి టెస్టులో అద్భుత విజయం సాధించి, రెండో టెస్టులో ఓటమిపాలైంది. ఈ ప్రదర్శనతో 78 రేటింగ్ పాయింట్లతో ఆరో స్థానానికి చేరుకుంది. ఈ క్రమంలో వెస్టిండీస్, పాకిస్థాన్, శ్రీలంక వంటి బలమైన జట్లను వెనక్కి నెట్టింది.

ఈ ఘనతపై బంగ్లాదేశ్ టెస్ట్ కెప్టెన్ నజ్ముల్ హోస్సేన్ శాంటో ఆనందం వ్యక్తం చేశాడు. "టెస్టుల్లో ఆరో ర్యాంకుకు చేరుకోవడం కచ్చితంగా శుభవార్తే. ఇది మాకు అతిపెద్ద విజయం" అని వ్యాఖ్యానించాడు. అయితే, రెండో టెస్టులో ఓటమి నేపథ్యంలో, మరింత మెరుగ్గా ఆడి ఉంటే బాగుండేదని అభిప్రాయపడ్డాడు.

**తరచుగా పర్యటనలు జరగాలి: కెప్టెన్ శాంటో**

సందర్భంగా శాంటో కీలక విజ్ఞప్తి చేశాడు. ఆస్ట్రేలియా వంటి దేశాల్లో తమ జట్టు తరచుగా పర్యటించాలని కోరాడు. "మేము 23 ఏళ్ల సుదీర్ఘ విరామం తర్వాత ఆస్ట్రేలియాలో టెస్ట్ సిరీస్ ఆడాం. ఇలాంటి కఠినమైన పరిస్థితుల్లో, నాణ్యమైన జట్టుతో పోటీపడటం అంత సులభం కాదు. ఇక్కడికి తరచుగా వస్తుంటే, మా ఆటగాళ్లకు పరిస్థితులపై అవగాహన పెరుగుతుంది, అనుభవం వస్తుంది" అని అన్నాడు. కేవలం టెస్టులే కాకుండా, వన్డేలు, టీ20ల కోసం కూడా ఆస్ట్రేలియాకు పర్యటించే అవకాశాలు పెంచాలని విజ్ఞప్తి చేశాడు.

**సిరీస్ సాగిందిలా..**

డార్విన్‌లో జరిగిన తొలి టెస్టులో బంగ్లాదేశ్ చారిత్రక విజయాన్ని అందుకుంది. ఆస్ట్రేలియా గడ్డపై ఇదే వారి తొలి టెస్ట్ గెలుపు. ఆ మ్యాచ్‌లో తొలుత ఆసీస్‌ను 198 పరుగులకే ఆలౌట్ చేయడంలో హసన్ మహమూద్ (6 వికెట్లు) కీలక పాత్ర పోషించాడు. అనంతరం తంజీద్ హసన్ సెంచరీతో రాణించడంతో బంగ్లా తొలి ఇన్నింగ్స్‌లో 426 పరుగుల భారీ స్కోరు సాధించింది. రెండో ఇన్నింగ్స్‌లో 57 పరుగుల స్వల్ప లక్ష్యాన్ని ఒక వికెట్ మాత్రమే కోల్పోయి ఛేదించింది.అయితే, రెండో టెస్టులో ఆస్ట్రేలియా పూర్తి ఆధిపత్యం ప్రదర్శించింది. పేసర్ మిచెల్ స్టార్క్ (మ్యాచ్‌లో 10 వికెట్లు) బంగ్లా పతనాన్ని శాసించాడు. అతని ధాటికి బంగ్లా తొలి ఇన్నింగ్స్‌లో 64 పరుగులకే, రెండో ఇన్నింగ్స్‌లో 95 పరుగులకే కుప్పకూలింది. ఫలితంగా ఆస్ట్రేలియా ఇన్నింగ్స్ 51 పరుగుల తేడాతో ఘనవిజయం సాధించింది. ఈ పర్యటన బంగ్లాదేశ్‌కు ఒకవైపు చారిత్రక ర్యాంకును అందివ్వగా, మరోవైపు కఠిన పరిస్థితుల్లో నిలకడగా రాణించాలంటే మరిన్ని అవకాశాలు అవసరమని గుర్తు చేసింది.

# అనిపిస్తున్న కృతి శెట్టి లేటెస్ట్ పిక్స్.. వీకెండ్ లుక్ చూస్తే ఫిదా కావాల్సిందే!

టాలీవుడ్ లో ఉప్పెన సినిమాలో బెబమ్మగా పరిచయమై తొలి చిత్రంతోనే సౌత్ ఇండియా వ్యాప్తంగా కుర్రకారు గుండెల్లో స్థానం సంపాదించుకుంది కృతి శెట్టి. కేవలం తెలుగులోనే కాకుండా తమిళ, మలయాళ భాషల్లోనూ వరుస సినిమాలు చేస్తూ నేటితరం క్రేజీ హీరోయిన్‌గా దూసుకుపోతోంది. తాజాగా ఈ భామ 'వీకెండ్ వైబ్స్' అంటూ సోషల్ మీడియాలో షేర్ చేసిన క్యాజువల్, క్లీన్-గర్ల్ లౌంజ్‌వేర్ ఫొటోషూట్ పిక్స్ ఇప్పుడు నెట్టింట విపరీతంగా వైరల్ అవుతూ అందరినీ ఆకట్టుకుంటున్నాయి.



లైమ్ గ్రీన్ దుస్తుల్లో ఆకట్టుకుంటున్న రాయ్ లక్ష్మి

**సింపుల్ అండ్ స్టైలిష్ లౌంజ్‌వేర్ లుక్:**

తాజా ఫొటోషూట్‌లో కృతి శెట్టి చాలా సింపుల్‌గా, అంతే స్టైలిష్‌గా కనిపిస్తోంది. రిబ్బెడ్ నిట్ క్రాప్డ్ ట్యాంక్ టాప్, దానికి మ్యాచింగ్ వైడ్-లెగ్ నిట్ ప్యాంట్స్ ధరించి ఇంట్లో ప్రశాంతంగా గడిపే క్యాజువల్ వీకెండ్ లుక్‌ను ప్రదర్శించింది. ఇక సన్-హైలైటెడ్ బ్రౌన్ హెయిర్ వేవ్స్ భుజాలపై పడుతుండగా, న్యూడ్ లిప్‌స్టిక్, లైట్ మేకప్‌తో మినిమల్ హై-ఫ్యాషన్ స్ట్రీట్ స్టైల్‌ను ఎంతో పర్‌ఫెక్ట్‌గా మేనేజ్ చేసి అభిమానులను మైమరపింపజేస్తోంది.




**'ఉప్పెన' నుంచి 'మనమే' వరకు బిజీ బిజీ:**

తన డెబ్యూ మూవీ 'ఉప్పెన' నటనకు గాను ఫిల్మ్‌ఫేర్, సైమా వంటి ప్రతిష్టాత్మక అవార్డులను అందుకున్న కృతి, ఆ తర్వాత వరుస ప్రాజెక్టులతో బిజీగా మారింది. ఇటీవలే శర్వానంద్‌తో కలిసి నటించిన 'మనమే' చిత్రం బాక్సాఫీస్ వద్ద మంచి విజయాన్ని అందుకుంది. ఇక నటనతో పాటు అందంతోనూ మెప్పిస్తున్న ఈ కన్నడ కుట్టికి దక్షిణాదిలో వరుస అవకాశాలు తలుపు తడుతున్నాయి.

**2040 కాన్సెప్ట్‌తో 'లవ్ ఇన్సూరెన్స్ కంపెనీ':**

తాజాగా విఘ్నేష్ శివన్ దర్శకత్వంలో ప్రదీప్ రంగనాథన్, ఎస్. జె. సూర్యలతో కలిసి ఆమె నటించిన సైన్స్ ఫిక్షన్ రొమాంటిక్ కామెడీ 'లవ్ ఇన్సూరెన్స్ కంపెనీ' థియేటర్లలోకి వచ్చి మంచి విజయాన్ని అందుకుంది. ఇక 2040 నాటి టెక్నాలజీ ప్రపంచం నేపథ్యంలో సాగే ఈ సినిమాలో కృతి 'ధీమా' అనే ఆన్‌లైన్ ఇన్‌ఫ్లుయెన్సర్ పాత్రలో కనిపించింది. తన నిజ జీవితానికి దగ్గరగా ఉన్న ఈ పాత్రలో ఆమె నటనకు మంచి మార్కులు పడ్డాయి. వెండితెరపై నటనతో అలరించడమే కాకుండా, సోషల్ మీడియాలో తన గ్లామరస్ అండ్ స్టైలిష్ పిక్స్‌తో నిరంతరం అభిమానులకు టచ్‌లో ఉంటోంది కృతి శెట్టి. తక్కువ వయసులోనే అవార్డులు, హిట్లు సాధిస్తూ టాలెంట్, గ్లామర్ రెండింటినీ సమంగా బ్యాలెన్స్ చేస్తున్న ఈ క్యూట్ బ్యూటీ.. రాబోయే రోజుల్లో సౌత్ ఇండస్ట్రీలో మరిన్ని సంచలనాలు సృష్టించడం ఖాయం..



అందమైన ఐవరీ రంగు చీరలో అద్భుతంగా కనిపిస్తున్న జాన్వీ కపూర్

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at printed at SRI SAI GANGA PRINTERS AND PUBLISHERS FLAT NO: 504, Bharat Towers, 5th lane, Dwaraka Nagar, Visakhaptanam, Andhrapradesh-530016, and published at Flat No F2, Nihar towers, Srinagar, kakinada, kakinada District-533003
Editor: GANTYADA APPARAO. Mobile : 9059465965, RNI : APTEL/2017/73154 , editorpenpower@gmail.com